చేవెళ్లలో గంజాయి మొక్కల సాగు

-పోలీసుల అదుపులో నలుగురు వ్యక్తులు

చేవెళ్ల, జూన్ 6, ప్రభాతవార్త:
గంజాయి మొక్కలను సాగు చేసినవారి గుట్టును చేవెళ్ల పోలీసులు రట్టుచేశారు. పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే.. చేవెళ్ల గ్రామంలోని చైత్ర రెస్టారెంట్ వెనుక ఉన్న ప్రీకాస్ట్‌వాల్ తయారీ ప్రాంగణంలో కొందరు వ్యక్తులు నిషేధిత గంజాయి మొక్కలను పెంచుతున్నారన్న పక్కా సమాచారంతో పోలీసుబృందం క్లూస్ టీం సమక్షంలో సదరుప్రాంతంలో తనిఖీలు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మొక్కలను తూకంవేయగా ఒక ఎండినమొక్క, ఒక సగం ఎండిన మొక్క కలిపి సుమారు 2.100 కిలోల బరువు ఉండగా, పచ్చి గంజాయి మొక్క సుమారు 1.050 కిలోల బరువు ఉన్నట్లు నిర్ధారించారు. స్వాధీనంచేసుకున్న గంజాయి మొక్కలను చట్టపరమైన విధానాల ప్రకారం సీజ్ చేసి సీల్ వేశారు. ఈ కేసులో బీహార్ రాష్ట్రానికి చెందిన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

దళితుడిపై దాడి ఘటనలో తండ్రీకొడుకులపై అట్రాసిటీ కేసు

పూడూరు, జూన్ 6, ప్రభాతవార్త:
దళితుడిపై దాడిచేసిన ఘటనలో అగ్రకులానికి చెందిన ఇద్దరు తండ్రీకొడుకులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు అయిన సంఘటన వికారాబాద్‌జిల్లా పూడూరు మండలకేంద్రంలో చోటు చేసుకుంది. చెన్‌గోముల్ ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. గతనెల 20తేది రాత్రి 10:45 గంటల ప్రాంతంలో పూడూరు గ్రామానికి చెందిన పట్లోళ్ల శ్రీకాంత్‌రెడ్డికి చెందిన వాటర్ ట్యాంకర్ గ్రామ ప్రధానచౌరస్తా మీదుగా వెళుతుంది. అదే సమయంలో అదే గ్రామానికి చెందిన తిర్మలాపూర్ రమేష్ అనేవ్యక్తి వాటర్‌ట్యాంకర్‌ను ఆపి, ఎక్కడికి వెళుతుందని ప్రశ్నించడంతో ఆగ్రహించిన ట్యాంకర్ యజమాని పట్లోళ్ల శ్రీకాంత్‌రెడ్డి, అతని కుమారుడు పట్లోళ్ల మౌనిక్‌రెడ్డిలు అసభ్యపదజాలంతో రమేష్ పై దాడిచేసి గాయపరిచారు. బాధితుడు రమేష్ ఫిర్యాదు మేరకు గతనెల 21వ తేదిన కేసు నమోదు చేసుకున్న చెన్‌గోముల్ పోలీసులు దర్యాప్తులో భాగంగా మెడికల్ రిపోర్టు, సాక్ష్యాధారాలను సేకరించి శనివారం ఎస్‌సి, ఎస్‌టి చట్టంకింద సెక్షన్ అలర్ట్‌చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా బాధితుడు రమేష్ పూడూరు మండలం నవ తెలంగాణ రిపోర్టర్‌గా కొనసాగుతున్నాడు.

కోహెడ శంకుస్థాపనకు కదిలిన కాంగ్రెస్ శ్రేణులు

శంకుస్థాపనకు తరలివెళ్తున్న కాంగ్రెస్‌పార్టీ ముఖ్య నాయకులు, రైతులు

ఇబ్రహీంపట్నం, జూన్ 6, ప్రభాతవార్త:
ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చేతులమీదుగా కోహెడలో అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాటు కానున్న ఫ్రూట్ మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమానికి మంచాలమండలం ఆరుట్ల గ్రామం నుంచి రైతులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు భారీసంఖ్యలో తరలివెళ్లారు. కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, మంచాల సహకారసంఘం చైర్మన్ వెదిరే హనుమంత్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడమ నరేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో వీరంతా కోహెడకు బయలు దేరారు. అంతర్జాతీయ హంగులతో నిర్మించనున్న ఈ మార్కెట్ ద్వారా ఈప్రాంత రైతులకు ఎంతోమేలు జరుగుతుందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ముఖ్యనాయకులు బైరిక రమాకాంత్‌రెడ్డి, అనంగల్ల యాదయ్య, సాతిరి ఎల్లేష్, సుంకరి పండరినాథ్, ఎండి సలాం, కావలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి వెన్నెముకకు అరుదైన శస్త్రచికిత్స

రోగి వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

మేడ్చల్, జూన్ 6, ప్రభాతవార్త:
మేడ్చల్ ఉమ్మడి మండల పరిధిలోని గుండ్లపోచంపల్లిలో బాలగాని స్పైన్ అండ్ ఆర్థో ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహిం చారు. ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి డాక్టర్ శ్రీనివాస్ బాలగాని తెలిపిన వివరాల ప్రకారం మెదక్‌జిల్లా తూప్రాన్ మండలం, ఘనపూర్ గ్రామానికి చెందిన 12 సంవత్సరాల బాలుడు వెన్నెముక వంకర తిరిగి తీవ్రమైన న్యూరోమస్క్యులర్ స్కోలియోసిస్ వ్యాధితో బాధపడుతూ ఇటీవల బాలగాని స్పైన్ ఆస్పత్రిలో మెరుగైన చికిత్సకోసం చేరాడు. వైద్యులు ఆ బాలుని ఆరోగ్య పరిస్థితి క్షుణ్ణంగా పరిశీలించి సుమారు 8 గంటలపాటు క్లిష్టమైన శస్త్రచికిత్స చేసి వెన్నెముక వంకరను సరిచేసారు. ఈ ఆపరేషన్ సమయంలో స్క్రూలు, రాడ్లు ఉపయోగిస్తూ, నరాలభద్రతను నిరంతరం పర్యవేక్షించేందుకు అత్యాధునికపరికరాలు వినియోగించామని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్యంగా ఉన్నాడని, త్వరగా కోలుకుంటూ, స్వయంగా నడవగలుగుతున్నాడని చెప్పారు. కాగా, చికిత్సను విజయవంతంగా చేసినందుకుగాను రోగి కుటుంబసభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

షాద్‌నగర్‌లో గిరిజన యువకుడిపై దాడి

-షాద్‌నగర్ పోలీస్ స్టేషన్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

షాద్‌నగర్, జూన్ 6, ప్రభాతవార్త:
షాద్‌నగర్ పట్టణంలోని అయ్యప్ప కాలనీలో గిరిజన యువకుడిపై దాడి చేసి కులం పేరుతో దూషించిన ఘటనపై పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసుల వివరాల ప్రకారం, ఫరూక్‌నగర్ మండలంలోని గుండ్యానాయక్ తండాకు చెందిన పాత్లావత్ సందీప్ (22) ఈ నెల 5వ తేదీన సాయంత్రం అయ్యప్ప కాలనీలో లారీ మరమ్మతు పనులు చేస్తుండగా ఓకారులో వచ్చిన వ్యక్తులు మరో ద్విచక్ర వాహనదారుడితో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో సందీప్ జోక్యం చేసుకుని ప్రశ్నించగా అతనితో పాటు కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడి సమయంలో బాధితులు లంబాడీ భాషలో మాట్లాడుతుండగా, వారు లంబాడా గిరిజన వర్గానికి చెందినవారని తెలుసుకుని కులంపేరుతో అవమానకర పదజాలంతో దూషించారని ఆరోపించారు. అనంతరం ఇంటివద్దకు కూడా వెళ్లి బెదిరింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈఘటనలో మల్లేష్, టిల్లు, మనోజ్, అరుణ్, సుమన్, అనూక్ మరికొందరు పాల్గొన్నట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఫిర్యాదు మేరకు షాద్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భారతీయ న్యాయ సంహిత (బి.ఎన్.ఎస్)లోని పలు సెక్షన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం కింద కేసు నమోదుచేశారు.

చీర్యాలలో అర్ధరాత్రి దారుణం

కీసర, జూన్ 6, ప్రభాతవార్త:
కీసర సర్కిల్ పరిధిలోని చీర్యాలలో శుక్రవారం అర్ధరాత్రి దారుణం జరిగింది. చీర్యాల గ్రామంలో సర్వే నంబర్ 156లో ఉన్న కోళ్ల రమేష్‌కి 1 ఎకరా 37 గుంటల భూమి ఉంది. ఆభూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించి అర్ధరాత్రి 50 గుండాలతో తమపై దాడిచేసిన పల్లె భద్రారెడ్డి అనే వ్యక్తిపై కఠినచర్యలు తీసుకోవాలని కోళ్ల రమేష్ శనివారం కీసర పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా నాగారంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న బాధితులు రమేష్, పారిజాతలు మాట్లాడుతూ మా తాతలనాటి భూమిని చదును చేస్తూ ప్రహరీగోడ పెట్టి ఉండగా పల్లె భద్రారెడ్డి అనే వ్యక్తి మా పక్కనే కొంత భూమిని కొనుక్కొని, ఈభూమి కూడా మాదేనని గతంలో అనేకసార్లు మాపై దాడిచేశారని తెలిపారు. కీసర పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని, గతరాత్రి కూడా తమపై దాడిచేశారని ఫిర్యాదు చేసినా, మాకు చెప్పకుండా ఎందుకు వెళ్లారని మమ్మల్నే బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పోలీసులు కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని మాకు చెందిన వ్యక్తి కంటైనర్‌లో పడుకుంటే, గోడదూకి వచ్చి పెట్రోల్ పోయడంతో భయపడి బయటికి రావడంతో అతడిని కూడా చితకబాదారని తెలిపారు. 2020వ సంవత్సరంలో ఈభూమి మాదంటూ మామీదికిరావడంతో కోర్టును కూడా ఆశ్రయించామని, 2025లో కూడా ఇలాగే భూమిపైకి రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని, పోలీసులు పూర్తి స్థాయి రిపోర్టును ఇవ్వమని ఎంఆర్ఓ, ఆర్‌డిఓని కూడా కోరామన్నారు. ఆ రిపోర్టు ప్రకారం సిసి ఎవరి భూమిలో వారు ఉండాలని ఇరువర్గాలకు సూచించారని, అయినా కూడా మాభూమి పైకి కబ్జాచేసేందుకు వచ్చి, మాపై దాడిచేశారని బాధితులు వాపోయారు. భద్రారెడ్డిపై చట్టపరమైన చర్యలుతీసుకోవాలని అధికారులను కోరారు. ఇప్పటికైనా పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టించుకుని మాభూమి మాకు ఇప్పించి న్యాయంచేయాలని బాధితులు వేడుకున్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆష్కరించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్, జూన్ 6. ప్రభాతవార్త:
ఎల్లంపేట మున్సిపాలిటీలోని రావల్ కోల్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని శనివారం రాత్రి 8 గంటలకు మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ యువతకు ఆదర్శమని, ఆయన ఆశయసాధనలో ప్రతి ఒక్కరు నడుచుకుని దేశ సేవ చేయాలని కోరారు. భవిష్యత్ అంతా యువతదే ఉందని, యువత ఆదర్శప్రాయంగా నడుచుకుని నడుం బిగిస్తే దేశం ఆదర్శవంతంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట మున్సిపల్ చైర్మన్ శ్రీదేవి, మాజీ వైస్ ఎంపిపి వెంకటేష్ ముదిరాజ్, నాయకులు రాజ మల్లారెడ్డి, భాస్కర్‌యాదవ్, వెంకటేష్, రాజు, హరత్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, మహేందర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి

కొత్త అభ్యర్థులకు అందని 'ఆసరా'..!

-కార్యాలయాల చుట్టూ అర్హుల ప్రదక్షిణలు..!

-ఉత్తర్వులు రాక మంజూరులో జాప్యం

దౌల్తాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:
రాష్ట్రంలో కొత్తప్రభుత్వం ఏర్పడి నేటికి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా.. ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన 'తీపి కబురు' ఎప్పుడు అందుతుందా అని వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలంలోని అర్హు లైన లబ్ధిదారులు గంపెడు ఆశతో ఎదురుచూస్తు న్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనే త, గీత కార్మికులు, వికలాంగులతోపాటు 57ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికీ ఆసరాపింఛన్లు అందిస్తా మని ఎన్నికలవేళ హామీ ఇచ్చిన సంగతి తెలి సిందే. అయితే, ప్రభుత్వం ఏర్పాటై నేటికి రెండు న్నరసంవత్సరాలు గడుస్తున్నా, అటు పాతవారికి పింఛన్ల పెంపుగాని, ఇటు కొత్తవారికి నూతన పిం ఛన్ల మంజూరుపైగాని ఇంతవరకు స్పష్టమైన సానుకూల స్పందన రాకపోవడంతో లబ్ధిదారులకు ఎదురుచూపులే మిగిలాయి. ప్రభుత్వం నుంచి నూతనపింఛన్ల మంజూరుకు సంబంధించి ఎలాం టి జీవోలు, మార్గదర్శకాలు (ఉత్తర్వులు) రాకపోవ డంతో దౌల్తాబాద్‌మండలంలో 57ఏళ్లు పూర్తయిన అర్హులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమకు పింఛన్ వచ్చేలా చూడాలని కోరుతూ నిత్యం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ, ప్రజాప్రతినిధుల ఇళ్లచుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గ్రామాల్లో ఏ ప్రజాప్రతినిధి కనిపించినా, ఏ ప్రభుత్వ అధికారి తారసపడినా.. తమకు పింఛను ఎప్పుడు మం జూరు చేస్తారంటూ అర్హులు ఆవేదనతో ప్రశ్నిస్తు న్నారు. నెలలు గడుస్తున్నా, హామీలు అమలుకు నోచుకోకపోవడంతో లబ్ధిదారుల్లో అసహనం పెరు గుతోంది. ఇదే విషయమై స్థానిక అధికారులను సంప్రతిస్తే, ప్రభుత్వంనుంచి స్పష్టమైన ఉత్తర్వు లు, నూతన మార్గదర్శకాలు వస్తేనే కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియ లేదా పాత పింఛన్ల పెంపు సాధ్యమవుతుందని, అంతవరకు తాము ఏమీ చేయలేమని చేతులెత్తేస్తున్నారు. కొడంగల్ నియో జకవర్గపరిధిలోని దౌల్తాబాద్ మండల ప్రజలు ఈ విషయంలో మరింత ఆశగా ఉన్నారు. ఇది స్వ యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తు న్న నియోజకవర్గం కావడంతో, తమ సమస్యపై ప్రభుత్వం త్వరలోనే సానుకూల నిర్ణయం తీసు కుంటుందని ఇక్కడి ప్రజలు బలంగా నమ్ముతు న్నారు. 57 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ త్వరగా 'ఆసరా' అందించి ఆదుకోవాలని, తమ నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి తక్ష ణమే ఉత్తర్వులు జారీ చేయాలని ఇక్కడి అర్హులు రాష్ట్రప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ఆవేదనతో వే డుకుంటున్నారు. దౌల్తాబాద్ మండలపరిధిలోని 33గ్రామ పంచాయితీల్లో ప్రస్తుతం 9,513 మంది లబ్ధిదారులకు ఆసరా పింఛన్లు అందుతున్నాయి. మండలంలో అత్యధికంగా 4,577మందికి వృద్ధాప్య పింఛన్లు, 3,426మందికి వితంతు పింఛన్లు అందుతుండగా, 972మంది దివ్యాంగులు ఈపథ కం ద్వారా లబ్ధి పొందుతున్నారు. వీరితో పాటు 339మంది ఒంటరి మహిళలకు, 100మంది చేనే తకార్మికులకు, 96మంది గీతకార్మికులకు, ముగ్గు రు బీడీ కార్మికులకు ప్రభుత్వం నుండి సామాజిక భద్రతా పింఛన్లు అందుతూ వారి కుటుంబాలకు ఆర్థికభరోసాగా నిలుస్తున్నాయి. వీరితో పాటు 57 సంవత్సరాలు పూర్తిచేసుకొని కొత్తగా అర్హత సా ధించిన వందలాదిమంది కూడా త్వరగా తమకు ఆసరా లభిస్తే కుటుంబాలు గడుస్తాయని కోరుకుం టున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నూతన మార్గదర్శకాలను విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మండల ప్రజా పరిషత్ కార్యాలయం దౌల్తాబాద్

ప్రభుత్వంనుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. రాగానే చర్యలు తీసుకుంటాం...

-శ్రీనివాస్, ఎంపిడిఓ, దౌల్తాబాద్

కొత్తపింఛన్లకు సంబంధించిన విషయంపై ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. అయితే మండలపరిధిలో 57సంవత్స రాలు పూర్తి అయినవారికి సంబంధించిన వివరా లను ముందస్తుగానే సేకరించి సిద్ధంగా ఉంచాం. ప్రభుత్వంనుంచి ఆదేశాలు లేదా ఉత్తర్వులు వెలు వడగానే పంచాయతీ కార్యదర్శులతోపాటు సర్పం చులకు సమాచారం అందిస్తాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందేలా తగినచర్యలు తీసుకు నేందుకు కృషిచేస్తాం.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

-జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

వికారాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:
డబుల్ బెడ్ రూమ్‌ల లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో తాండూరు నియోజకవర్గంలోని డబుల్ బెడ్ రూమ్‌ల ఎంపిక ప్రక్రియపై జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, అదనపు కలెక్టర్ (స్థానికసంస్థలు), అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వెంకటాచారి, తాండూర్ శాసనసభ్యులు బుయ్యని మనోహర్‌రెడ్డి, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాథోడ్ దశరథ సింగ్, మునిసిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్‌రెడ్డిల సమక్షంలో రాండమైజేషన్ ద్వారా ఇళ్ల కేటాయింపుపై కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తాండూరు నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూముల నిమి త్తం 8333 దరఖాస్తులు వచ్చాయని, 1001 డబుల్ బెడ్‌రూమ్‌ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ప్ర స్తుతం 581 ఇళ్ల లబ్ధిదారులకు కేటా యించేందుకు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఇళ్ల కేటాయింపులు ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా ర్యాండమైజేషన్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని ఆయన తెలిపారు. ర్యాండమైజేషన్ ద్వారా ఎంపికైన లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హత ఉన్నట్లయితే ఇళ్ల కేటాయింపు జరుగుతుందని కలెక్టర్ తెలి పారు. అర్హత లేకుండా ఇళ్ల కేటాయింపు జరిగిందని తెలిసిన పక్షంలో ఫిర్యాదులను స్వీకరించి మరో దఫా విచారణ చేపడతామని కలెక్టర్ తెలిపారు.

బ్యూటీషియన్ రంగానికి డిమాండ్

-మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి

షాద్‌నగర్, జూన్ 6, ప్రభాతవార్త:
తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్ ఆధ్వర్యంలో, తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఆమోదించబడిన సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్ అడ్వాన్స్ బ్యూటీషియన్ కోర్స్ షాద్‌నగర్ మున్సిపల్‌లో ఉన్న ఫరూక్‌నగర్‌లో గత మూడు నెలలుగా విజయవంతంగా కొనసాగుతోంది. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో ప్రారంభమైన ఈశిక్షణాకార్యక్రమం సెమినా మహిళా సేవామండలి అధ్యక్షురాలు ఆలియా సుల్తానా ఆధ్వర్యంలో ఫరూక్‌నగర్ మైనార్టీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహి స్తున్నారు. ఈ కోర్స్‌లో 30 మంది యువతీయువకులు శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ వి.సునీతారెడ్డి శిక్షణాకేంద్రాన్ని సందర్శించి, విద్యార్థినులు నేర్చుకున్న నైపుణ్యాలు, వారు నిర్వహించిన ప్రాక్టికల్ పనులు, హెయిర్ స్టైలింగ్ నమూనాలను పరిశీలించి వారిని అభినందించారు. విద్యార్థినులతో మాట్లాడిన కమిషనర్ సునీతారెడ్డి, ప్రస్తుతం బ్యూటీషియన్ రంగానికి మంచి డిమాండ్ ఉందని, ఈ రంగంలో స్వయం ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధితో పాటు ఉన్నత విద్యకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె పేర్కొన్నారు. అలాగే సెమినా మహిళా సేవామండలి అధ్యక్షురాలు ఆలియా సుల్తానాను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గత 15 సంవత్సరాలుగా ఆలియా సుల్తానా సమాజం కోసం, ముఖ్యంగా మహిళల అభివృద్ధి కోసం ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సేవలు అందిస్తున్నారని కమిషనర్ సునీత ప్రశంసించారు. మీరు కూడా ఆమెను స్ఫూర్తిగా తీసుకుని సమాజానికి మీ వంతు సహాయం అందించే దిశగా ముందుకు సాగాలి. తన జీవితాన్ని ఉదాహరణగా చూపిస్తూ, నేనుకూడా మీలో ఒకదాన్నే. నేడు షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. మీరుకూడా నైపుణ్య కోర్సులతో పాటు ఉన్నతవిద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలు సాధించాలి. సమాజ అభివృద్ధికి మనవంతు సేవ అందించాలని విద్యార్థినులకు ప్రేరణాత్మకసందేశం ఇచ్చారు. ఈసందర్భంగా నిర్వాహకులు, శిక్షణపొందుతున్న యువతీయువకులు రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్‌కార్పొరేషన్, చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

బ్యూటీషియన్ శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

రేపు యాలాల పోలీస్ స్టేషన్‌ను సందర్శించనున్న జిల్లా ఎస్పీ

యాలాల జూన్ 6, ప్రభాతవార్త:
ఈ నెల 8వ తేదీ(సోమవారం) వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా యాలాల పోలీస్ స్టేషన్‌ను సందర్శించనున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. సాధారణ తనిఖీలో భాగంగా ఎస్పీ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి తనిఖీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఎస్పీ యాలాల స్టేషన్‌ను సందర్శించడం ఇదే మొదటిసారి అని ఎస్ఐ తెలిపారు.

మర్పల్లిలో ఘోర ప్రమాదం

మర్పల్లి, జూన్ 6, ప్రభాతవార్త:
మర్పల్లి మండల కేంద్రంలో శనివారం ఉదయం ఎస్సీ కార్పొరేషన్ వ్యాపార దుకాణ సముదాయంలోని టిఫిన్‌సెంటర్ స్లాబ్ ఒక్కసారిగా కూలిపోవడంతో అక్కడ ఉన్న ప్రజలు భయంతో పరుగులుతీశారు. శిథిలాల కింద ఎంతమంది చిక్కుకున్నారో తెలియక పోవడంతో హుటాహుటిన గ్రామ ప్రజలు, పోలీసులు, నాయకులు, యువకులు జెసిబిలను తెప్పించి శిథిలాలను తొలగించి నలుగురిని వెలికితీశారు. మర్పల్లిగ్రామానికి చెందిన ముగ్గురు, కొత్లాపూర్ గ్రామానికి చెందిన ఒక్కరు తీవ్రగాయాలతో బయటపడగా వారిని మర్పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వారికి ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మర్పల్లిగ్రామానికి చెందిన ఎండి నజీర్, రమేష్, చందన, కొత్లాపూర్‌గ్రామానికి చెందిన, శివకుమార్ గాయపడ్డారు. ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన దుకాణాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ దుకాణాలను ఖాళీచేశారు. ఇటీవల అదేదుకాణంలో టిఫిన్ సెంటర్ ప్రారంభించగా మెన్నటి వర్షానికి కొద్దిగా గోడలుకూలిపోగా ఈరోజు స్లాబ్‌కూలింది. ఈవిషయం తెలుసుకున్న గ్రామపెద్దలు, ప్రజలు, యువకులు, డిఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సిఐ వెంకట్, మర్పల్లి ఎస్ఐ అబ్దుల్‌రహూఫ్, పోలీస్ సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

కోడిపందాల స్థావరంపై దాడులు

-నిందితుల అరెస్టు, కోళ్లు, నగదు స్వాధీనం

పోలీసులు అదుపులో నిందితులు

రంగారెడ్డి అర్బన్, జూన్ 6, ప్రభాతవార్త:
గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కోడిపందాల స్థావరంపై ఎస్ఓటి, శంషాబాద్ రూరల్ పోలీసులు మెరుపు దాడిచేసి నిందితులను అరెస్టు చేశారు. సిఐ నరేందర్‌రెడ్డి వివరాల ప్రకారం... శంషాబాద్ మండల పరిధిలోని బూర్జుగడ్డ తండా గ్రామ పరిధిలోని ఓ మామిడి తోటలో కొందమంది వ్యక్తులు అక్రమంగా బెట్టింగ్ చేసుకుంటూ కోళ్ల పందేలు కాస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేయడం జరిగిందని కోళ్ల పందేలు ఆడుతున్న నిందితులు దుర్గాప్రసాద్, బండారు హరికృష్ణ, వర్మ, వంశికృష్ణ, రాంబాబు, సోమరాజు, భారత్, శివరామరాజు, సంజయ్‌రెడ్డిలను అదుపులోకి తీసుకొని వారి నుండి నగదు రూ.09,900/-, 11 కోళ్ళు, 08 సెల్ ఫోన్లు, 1 కార్, 03 బైక్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లింగారెడ్డిగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

-ఇద్దరు మైనర్ బాలురు అఖిల్, నవదీప్ మృతి

షాద్‌నగర్, జూన్ 6, ప్రభాతవార్త:
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ శివారులోని లింగారెడ్డిగూడ గ్రామ సమీపంలో శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మైనర్ బాలురు అఖిల్, నవదీప్ దుర్మరణం పాలయ్యారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం, టి.ఎస్.06 ఈ.యూ 8545 నంబర్ గల హోండా యూనికార్న్ బైక్‌పై ప్రయాణిస్తున్న అఖిల్, నవదీప్ అత్యంతవేగంగా వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు. ముందుగా టి.ఎస్. 32 6526 నంబర్ గల జెసిబిని ఢీకొన్న బైక్, అనంతరం టి.ఎస్. 15 యూడీ 0872 నంబర్ గల ఎంఎన్ఎన్ బస్సును ఢీకొంది. ప్రమాద తీవ్రతకు ఇద్దరు బాలురు అక్కడికక్కడే మృతిచెందారు. మృతుల్లో అఖిల్(19) ఫరూఖ్‌నగర్‌కు చెందిన జగదీశ్వర్, జయశ్రీ దంపతుల కుమారుడు. ఇటీవలే ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్నాడు. మరోబాలుడు నవదీప్(14) వికారాబాద్ జిల్లా సొదాపూర్ మండలం మండిపాలెం గ్రామానికి చెందిన శంకరయ్య, శ్యామల దంపతుల కుమారుడు. నవదీప్ తండ్రి మేస్త్రీగా పనిచేస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ప్రమాదానికిగల పూర్తి కారణాలపై దర్యాప్తు చేపట్టారు. ఈ విషాద ఘటనతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొనగా, స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి.

భార్య హత్య కేసును ఛేదించిన పోలీసులు -24 గంటల్లో నిందితుడు అరెస్టు

అత్తాపూర్ జూన్ 6,ప్రభాతవార్త :

భార్యపై అనుమానంతో కత్తి, రాడ్‌తో దాడి చేసి హత్య చేసిన నిందితుడిని అత్తాపూర్ పోలీసులు 24 గంటల్లో అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. రాజేంద్రనగర్ డీసీపీ ఎస్.శ్రీనివాస్, ఏసీపీ టి.శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వర రావు పర్యవేక్షణలో ఈ కేసును వేగంగా ఛేదించారు. ఈ మేరకు డీసీపీ నిందితుడి వివరాలను శనివారం తన కార్యాలయంలో వెల్లడించారు. మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన అవినాష్(37), సోనీ అలియాస్ కోమల్(31) భార్యభర్తలు. అవినాష్ ఆటోడ్రైవర్‌గా పని చేస్తుండగా సోనీ కోమల్ ఇళ్లల్లో పని చేసుకుంటు జీవనం కొనసాగిస్తున్నారు. ఎనిమిది సంవత్సరాలు దంపతులు సంతోషంగా ఉన్నప్పటికి తరువాత నిందితుడు చెడు అలవాట్లకు లోనై, మద్యం సేవిస్తూ కుటుంబ బాధ్యతను నిర్లక్ష్యం చేవాడు. ఆర్థిక, కుటుంబ విషయాలపై ఇద్దరి మధ్య తరచూ గోడవలు జరిగాయి. సోనీ ఇంటి పనిమనిషిగా పని చేసి కుటుంబాన్ని పోషించేది. తరువాత నిందితుడు మృతురాలి ప్రవర్తనపై అనుమానం పెంచుకోవడంతో తరచూ గోడవలు జరిగాయి. అవినాష్ సోనీపై అనుమానం పెంచుకున్నాడు. తరచు భార్యతో గోడవపడుతున్నాడు. గత కొంత కాలం క్రితం అవినాష్ సోనీపై కత్తితో దాడి చేయగా భాగ్యనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదై రిమాండ్‌కు వెళ్లి వచ్చాడు. అప్పటి నుంచి తిరిగి వీరి ఇద్దరి మధ్య తరచు గోడవలు జరుగుతున్నాయి. గత నాలుగు రోజుల క్రితం కూడా భార్యభర్తల మధ్య గోడవ జరగడంతో సోనీ అన్న దత్తు వచ్చి ఇరువురిని సర్దిచెప్పి వెళ్లాడు. ఈ నెల 5వ తేదీన ఉదయం 4 గంటలకు నిందితుడు కిటికీ ద్వారా గదిలోకి ప్రవేశించి కత్తితో మృతురాలిపై దాడి చేశాడు. ఆ సమయంలో మృతురాలు కేకలు వేయడంతో కూరగాయల కత్తి, కూరగాయలు తొక్కే పరికరం, ఇనుప రాడ్‌తో దాడి చేశాడు. ఈ ఘటనను కొందరు పొరుగువారు చూసి ఆడ్డుకునేందుకు ప్రయత్నించారు. అయినప్పటికి నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కారుపై స్టంట్లు...యువకులు అరెస్టు

-నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

-రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ రాజు హెచ్చరిక

అత్తాపూర్ జూన్ 6,ప్రభాతవార్త :

ఓఆర్ఆర్‌పై కొందరు యువకులు కారు రేసింగ్,స్టంట్లు చేస్తూ వీరంగం సృషించిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు.కారు డోర్‌పై కూర్చుని ప్రమాకర స్టంట్లు చేసిన యువకులను శనివారం అరెస్టు చేశారు.డ్రైవర్ సోహెబ్,ఓనర్ ఎండి సమీర్,ఎండి నవాజ్, షాహిబాజ్‌లా,జాహెద్ ఖాదీర్‌లను అరెస్టు చేసి స్టంట్లకు వినియోగించిన కారు టిఎస్ 35 హెచ్5397 కార్ను సీజ్ చేశారు.ఈ సందర్భంగా ఎస్‌హెచ్ఓ రాజు మాట్లాడుతూ...నిబంధనలకు విర్ధుదంగా రోడ్లపై స్టంట్లు చేస్తూ ఇతర ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ముఖ్యంగా యువకులు రోడ్లపైకి వచ్చి స్టంట్లు చేస్తూ వీడియోలు తీయడం సోషల్ మీడియాలో పెట్టకోవడం అలువాటుగా మారిపోయిందని నిబంధనలు ఉల్లంఘించి ఇలాంటి చర్యలకు పాల్పడితే తాటతీస్తామని హెచ్చరించారు.

చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రంగారెడ్డి అర్బన్ జూన్6,ప్రభాతవార్త :

పెద్దషాపూర్ గ్రామంలోని నాగసముద్రం చెరువులో గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది.సిఐ నరేందర్ రెడ్డి వివరాల ప్రకారం....శనివారం మధ్యాహ్నం పెద్దషాపూర్ గ్రామానికి చెందిన గోపనమోని రమేష్ యాదవ్ అనే వ్యక్తి నాగసముద్రం చెరువులో ఓ వ్యక్తి మృతదేహం తేలియాడుతున్నట్లు శంషాబాద్ పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీశారు.మృతుడు సుమారు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వ్యక్తిగా గుర్తించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో గుర్తుపట్టడం కష్టంగా మారింది. ముఖం, శరీర భాగాలు కుళ్లిపోవడంతో పాటు పురుగులు పడినట్లు పోలీసులు గుర్తించారు. చేతులు, కాళ్ల చర్మం ఊడిపోయి ఉండగా, గడ్డం ఎక్కువగా పెరిగి ఉంది.మృతుడు ఖాకీ రంగు షర్టు, బ్లూ రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉండగా, నడుముకు ఎరుపు రంగు టవల్ చుట్టుకుని ఉన్నాడు. కుడి చేతికి తెలుపు రంగు కడియం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతని ఎత్తు సుమారు 5.2 అడుగులు, చామనచాయ రంగు కలిగి ఉన్నట్లు పేర్కొన్నారు.ఈ ఘటనపై శంషాబాద్ పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

దినేష్ కుమార్‌కు కెఎస్ఆర్ అభినందనలు

నిజాంపేట్, జూన్ 6, ప్రభాతవార్త

హైదరాబాదులో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కీబోర్డ్ సంగీత కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన యువ వాయిద్యకారుడు కవి గారి దినేష్ కుమార్ ప్రత్యేక గుర్తింపు పొందారు.ఈ కార్యక్రమంలో 22 దేశాలకు చెందిన సుమారు 2000 మంది కీబోర్డ్ వాయిద్యకారులు పాల్గొన్నారు. గంటపాటు ఎలాంటి విరామం లేకుండా కీబోర్డ్ వాయిస్తూ తమ సంగీత ప్రతిభను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో అత్యుత్తమ నైపుణ్యాన్ని కనబరిచిన 777 మంది వాయిద్యకారులను నిర్వాహకులు ఎంపిక చేయగా, వారిలో దినేష్ కుమార్ కూడా స్థానం సంపాదించడం విశేషం.ఈ సందర్భంగా దినేష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డిని శనివారం కలిసి వారి ఆశీస్సులు పొందారు.దినేష్ కుమార్ సాధించిన ఈ ఘనతపై కెఎస్ఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను చాటుకుని గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌కు ఎంపిక కావడం ఎంతో గర్వకార ణమని, యువత తమ ప్రతిభతో దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. దినేష్ కుమార్ భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అతనికి నా పూర్తి సహకారం, ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు.

హైడ్రాపై బిఆర్ఎస్ నేత ఆగ్రహం

హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త: హైడ్రా కమీషనర్ ఎ.వి.రంగనాథ్ వ్యవహారశైలిపై బీఆర్ఎస్ సీనియర్ నేత ఎర్ల సుధాకర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అంబర్‌పేటలో విలేఖరులతో మాట్లాడుతూ తనకు సంబంధించిన ఖుష్కీ (పొడి) భూమిలో హైడ్రా అధికారులు అక్రమంగా ప్రవేశించి, బతుకమ్మకుంట పేరుతో కృత్రిమ చెరువును సృష్టించారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు సంబంధించిన శికం భూమి విషయంలో మాత్రం మినహాయింపులు ఇచ్చి, వివక్ష చూపుతున్నారని విమర్శించారు. తన భూమి వ్యవహారంలో సుప్రీంకోర్టు ధిక్కరణ అంశం ఉన్నప్పటికీ, కమీషనర్ రంగనాథ్ న్యాయస్థాన ఆదేశాలను పట్టించుకోవటం లేదని, కేంద్రహోం శాఖకు చెందిన ప్రజా ఫిర్యాదుల వేదిక (సిపిగ్రామ్స్) ద్వారా చేసిన ఫిర్యాదులను సైతం ఆయన తేలికగా తీసుకోవటం ఆశ్చర్యకరమని అన్నారు. కేంద్ర ప్రభుత్వ వ్యవస్థల పట్ల గౌరవం చూపాల్సిన ఆల్ ఇండియా సర్వీస్ అధికారిగా రంగనాథ్ వ్యవహారం సరికాదని తెలిపారు. హైడ్రా కమీషనర్‌పై తాను చేసిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

బివిఆర్ఐటీ కళాశాలను సందర్శించిన హిరోషిమా ప్రతినిధి బృందం

నిజాంపేట్, జూన్ 6, ప్రభాతవార్త

భారత్, జపాన్ మధ్య విద్యా, పరిశోధన, సాంస్కృతిక మరియు పారిశ్రామిక రంగాల సహకారాన్ని మరింత విస్తరించే దిశగా జపాన్‌లోని హిరోషిమా ప్రిఫెక్చర్ ప్రభుత్వానికి చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం బీవీఆర్ఐటీ హైదరాబాద్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించింది. శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న కళాశాలలోని విష్ణు జపాన్ అవుట్‌రీచ్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం ఈ బృందానికి ఘన స్వాగతం పలికారు.ప్రతినిధి బృందంలో ఇండస్ట్రియల్ హ్యూమన్ రిసోర్సెస్ డివిజన్ డైరెక్టర్ ఫునైషి హిరోయోషి, కోగా యుయా, హరాజోనో యోషిహిరో, టోయి మారియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విష్ణు జపాన్ అవుట్‌రీచ్ సెంటర్ ద్వారా అమలు చేస్తున్న ఇండో, జపాన్ విద్యా కార్యక్రమాలు, జపనీస్ భాషా శిక్షణ, విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి పథకాలు, జపాన్‌లో ఇంటర్న్‌షిప్‌లు, ఉన్నత విద్య అవకాశాలు, సంయుక్త పరిశోధనలు మరియు జపాన్ విశ్వవిద్యాలయాలతో ఉన్న భాగస్వామ్యాలపై సమగ్ర వివరాలు అందించారు.కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులతో సమావేశమైన ప్రతినిధి బృందం, భారతదేశం, జపాన్ మధ్య విద్యా, సాంకేతిక సంబంధాలను బలోపేతం చేయడంలో బీవీఆర్ఐటీ చేస్తున్న కృషిని అభినందించింది. అంతర్జాతీయ స్థాయి అవకాశాలను విద్యార్థులకు అందిస్తూ, ప్రపంచ స్థాయి నైపుణ్యాలను పెంపొందించే దిశగా కళాశాల చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంసించింది.ఈకార్యక్రమంలో బీవీఆర్ఐటీ హైదరాబాద్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, బీవీఆర్ఐటీ నర్సాపూర్ ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే, నారా జపాన్ హబ్ డాక్టర్ రామ భద్ర, పరిశోధన అభివృద్ధి విభాగం డీన్ డాక్టర్ రాజు ఏడ్ల, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీల్, జపనీస్ భాషా ఉపాధ్యాయులు టగూచి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. హిరోషిమా ప్రిఫెక్చర్, శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ మధ్య అభివృద్ధి చెందుతున్న సంబంధాలకు ఈ సందర్శన మరో కీలక మైలురాయిగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకు ప్రపంచ స్థాయి అవకాశాలు అందడమే కాకుండా, భారత్, జపాన్ ప్రజల మధ్య స్నేహబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

కంటి గవ్వ మార్గం ద్వారా మెదడు కణితి తొలగింపు...నిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స

జూబ్లీహిల్స్, జూన్ 6, ప్రభాతవార్తః

లతతో నిమ్స్ శస్త్ర చికిత్స వైద్య బృందం

నిమ్స్‌లో మరో అరుదైన శస్త్రచికిత్సను నిర్వహించారు. నిమ్స్ వైద్యులు అత్యాధునిక ఎండోస్కోపిక్ ట్రాన్స్ ఆర్బిటల్ అప్రోచ్ పద్ధతిలో కంటి గవ్వ మార్గం ద్వారా మెదడు కణితిని విజయవంతంగా తొలగించి ఈ ఘనతను సాధించారు. మెదక్ జిల్లా మథుర్ గ్రామానికి చెందిన మంగలి లత(50) తీవ్రమైన తలనొప్పితో నిమ్స్‌ను ఆశ్రయించారు. వైద్య పరీక్షల్లో భాగంగా కంటి వెనుక భాగంలోని పుర్రె అడుగు ప్రాంతంలో మెదడు కణితి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఈ కణితులకు క్రానియోటమీ శస్త్రచికిత్స అవసరమవుతుండగా, నిమ్స్ వైద్యులు కంటి గవ్వ సహజ మార్గాన్ని ఉపయోగించి చిన్న కోతతో ఎండోస్కోపిక్ విధానంలో కణితిని పూర్తిగా తొలగించారు. శస్త్రచికిత్సలో 3డీ న్యూరోనావిగేషన్, సియుఎస్ఏ తదితర అత్యాధునిక సాంకేతికతలను ఉపయోగించారు. దీంతో మెదడు కణజాలానికి తక్కువ నష్టం కలగడంతో పాటు రక్తస్రావం, ఇన్ఫెక్షన్ ప్రమాదం తగ్గి రోగి వేగంగా కోలుకున్నారని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప మాట్లాడుతూ, శస్త్ర చికిత్స అనంతర పరీక్షల్లో కణితి పూర్తిగా తొలగించబడినట్లు నిర్ధారణ అయిందని, రోగి ఎటువంటి న్యూరోలాజికల్ సమస్యలు లేకుండా ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయ్యారన్నారు. ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాల కింద ఈ చికిత్సను పూర్తిగా ఉచితంగా అందించామన్నారు. ఈ శస్త్రచికిత్సను న్యూరోసర్జరీ విభాగ హెచ్‌వోడీ డా. వై. వంశీకృష్ణ నేతృత్వంలోని బృందం విజయవంతంగా నిర్వహించిందన్నారు. ప్రముఖ న్యూరోసర్జరీ కేంద్రాల్లో ఒకటైన నిమ్స్‌లో ప్రతి సంవత్సరం 3,500కు పైగా మెదడు, వెన్నెముక శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు.

వడ్డెరలకు ప్రభుత్వ పనుల్లో 15 శాతం అమలు చేయాలి

హైదరాబాద్, జూన్ 6 ప్రభాతవార్త

రాష్ట్రంలో అత్యంత వెనుకబడి ఉన్న వడ్డెరులకు ప్రభుత్వ పనుల్లో 15శాతం రిజర్వేషన్‌ను తిరిగి అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాలని తెలంగాణ రాష్ట్ర వడ్డెర కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గుంజ రేణుక నారాయణను శనివారం తెలంగాణ రాష్ట్ర వడ్డెర కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సంపంగి రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గండికోట శ్రీనివాస్ తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవలే తెలంగాణ రాష్ట్ర వడ్డెర కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన గుంజ రేణుక నారాయణను ఎల్బీనగర్ చింతలకుంటలోని ఆమె నివాసంలో కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించి అభినందించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆ తరువాత టీడీపీ ప్రభుత్వాలు వడ్డెరులకు ప్రభుత్వ పనుల్లో వడ్డెరులకు 15 రిజర్వేషన్లను అమలు చేసారని, బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక 15 రిజర్వేషన్‌ను 3కు తగ్గించిందని, దీంతో వడ్డెరులు తీవ్రంగా నష్టపోయారని సంపంగి రమేష్ వివరించారు. 2014 ముందు ఏవిధంగానైతే రిజర్వేషన్ అమల్లో ఉండెనో, అదేవిదంగా ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డురులకు 15 రిజర్వేషన్ అమలు చేయాలనీ, అలాగే మైనింగ్‌లో గతంలో 20శాతం ఉన్న దానిని గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 శాతానికి కుదించిందని, దీనిని కూడ గతంలో మాదిరి 20శాతానికి అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి అమలు చేయించి వడ్డెరుల అభివృద్ధికి తోడ్పడాలని సంపంగి రమేష్ కోరారు. గుంజ రేణుక నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పనుల్లో 15, మైనింగ్ పనుల్లో 20 రిజర్వేషన్లను వడ్డెరులకు గతంలో మాదిరి అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గనుల శాఖ మంత్రి జి.వివేక్, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు దండగుల రాజు, ఒర్సు వెంకటేశ్వర్లు, గండికోట ఆనంద్ కుమార్, రేపన్ గిరిబాబు, బోదాసు శేఖర్ ,శివరాత్రి కొమరమల్లు ఒర్సు యాదగిరి, ముద్దంగుల నరసింహ, గండికోట లక్ష్మీనారాయణ, గండికోట జంగయ్య ,శివరాత్రి ఎంకన్న, పల్లపు బిక్షం, బొంత యాదగిరి పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తా

-బృందావన్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

అత్తాపూర్ జూన్ 6,ప్రభాతవార్త :

కాలనీల సమస్యల పరిష్కరమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ప్రతి కాలనీలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాల కల్పన కృషి చేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.శనివారం మైలార్దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. కాలనీలో నెలకొన్న పలు ప్రజా సమస్యలను ఆయన స్వయంగా పరిశీలించి, స్థానిక ప్రజలతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ పర్యటనలో భాగంగా కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా మరియు వీధి దీపాల (విద్యుత్ దీపాలు) పరిస్థితిపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా ఆరా తీశారు. స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను విన్న ఆయన, అక్కడికక్కడే అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతుల కల్పనపై తక్షణమే దృష్టి సారించాలని, పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే మా ప్రాధాన్యతని అన్నారు. కాలనీల్లో డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి కనీస వసతుల్లో ఎలాంటి లోపాలు ఉండకూడదని అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే వెంబడి అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లయ్య ,ఈఈ , జలమండలి అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు స్థానిక నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

హిందీ అనువాదంతో దాశరథీ శతకానికి దేశవ్యాప్త ప్రచారం

చిక్కడపల్లి జూన్ 6 ప్రభాతవార్త :

భక్త రామదాసు విరచిత దాశరథీ శతకాన్నితెలుగు అనువాద గ్రంథాన్ని ఆవిష్కరించిన దృశ్యం

భక్త రామదాసుగా ప్రసిద్ధి పొందిన కంచర్ల గోపన్న రచించిన దాశరథీ శతకం హిందీ భాషలోకి అనువాదం కావడంతో, ఇకపై ఇది తెలుగువారికే కాకుండా దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి వస్తుందని భక్త రామదాసు వంశస్థులు కె. రమణ ఆకాంక్షించారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ సౌజన్యంతో, సంగీత నాట్య కళా వేదికపై భక్త రామదాసు విరచిత దాశరథీ శతకాన్ని డాక్టర్ లక్ష్మణాచార్యులు, పద్మశ్రీ సంయుక్తంగా హిందీలోకి అనువాదం చేయగా, ఆ సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా కె. రమణ పుస్తక సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. తెలుగు భాషకే సొంతమైన విశిష్ట పద్య ప్రక్రియను, ఏమాత్రం అర్థం చెడకుండా హిందీ భాషలోకి అత్యంత అర్థవంతంగా అనువాదం చేసి దేశమంతటికీ పరిచయం చేయడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జయరాములు మాట్లాడుతూ దాశరథీ శతక పద్యాలలోని అంతరార్థాలను, భక్తి భావాన్ని ఉదాహరణలతో సహా వివరించారు. ఈ వేదికపై ప్రముఖులు కన్నన్, డాక్టర్ విజయ రాఘవాచార్య, డాక్టర్ రామానుజాచార్యులు, పరమేశ్వర తదితరులు పాల్గొనగా.. డాక్టర్ విజయసారధి, డాక్టర్ సుజాత కార్యక్రమ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించారు. కాగా, పుస్తకావిష్కరణకు ముందు ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన గాయక కవి సమ్మేళనం సదస్యులను విశేషంగా ఆకట్టుకుంది.

గంజాయి విక్రేత అరెస్ట్

తార్నాక, జూన్ 6 ప్రభాతవార్త : ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ డివిజన్ పరిధిలో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి సుమారు 855 గ్రాముల గంజాయి, డిజిటల్ వెయింగ్ మెషిన్, శామ్‌సంగ్ గెలాక్సీ మొబైల్ ఫోన్, గంజాయి ప్యాకింగ్‌కు ఉపయోగించే 20 పరికరాలు, రవాణాకు వినియోగించిన బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం. ఏపీ. ప్రకాషం జిల్లా నర్వా గ్రామానికి చెందిన కాకాని నరేంద్ర (27), నడరంలోని బోడుప్పల్లో నివాసముంటూ రాపిడో ఫుడ్ డెలివరి బాయిగా పనిచేస్తున్నారు. కాగా ఇతను ఆంధ్రప్రదేశ్‌లోని సరఫరాదారుల నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌లో అధిక లాభాల కోసం విక్రయిస్తున్నాడు. ఈ కేసులో పరారీలో ఉన్న ఏ2 నిందితుడు పి. మహేష్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక ఆధారాల సేకరణతో పాటు మరికొందరు సాక్షులను విచారిస్తున్నట్లు తెలిపారు.సికింద్రాబాద్ జోన్ డీసీపీ కె. రక్షిత మూర్తి, అదనపు డీసీపీ జే. నర్సయ్య, ఉస్మానియా యూనివర్సిటీ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. జగన్ పర్యవేక్షణ లో ఇన్‌స్పెక్టర్ మహేష్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ లెనిన్ బాబు, ఎస్ఐలు, క్లూస్ టీమ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఈ ఆపరేషన్‌ను నిర్వహించారు.

రోడ్డుపై పేరుకుపోయిన చెత్త.. అధికారుల పనితీరుకు నిలువుటద్దం..

నిజాంపేట్, జూన్ 6, ప్రభాతవార్త

రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు.. అన్నట్లుగా ఉంది నిజాంపేట్ సర్కిల్ మున్సిపల్ అధికారుల వ్యవహారశైలి. అసలే నిజాంపేటలోని డంపింగ్ యార్డుతో నానా తంటాలు పడుతుంటే.. ఇక రోడ్డు కూడా డంపింగ్ యార్డుగా మారిపోయి అధికారుల పనితీరుకు నిలువుటద్దంగా నిలుస్తోంది. ఎంతగా అంటే రోడ్డు కూడా డంపింగ్ యార్డులో వచ్చేసిందా? అన్న రీతిలో చెత్తా పేరుకుపోయి ఆ మార్గంలో వెళ్లేవారికి ప్రత్యక్ష నరకం అంటే ఏమిటో చూపిస్తోంది. రోడ్డు పొడవునా సగ భాగానికి పైగా చెత్త పేరుకుపోయి రాకపోకలకు చుక్కలు చూపిస్తోంది. ఇప్పుడు ఆ రోడ్డంటే వాహనదారులు భయపడిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. నిజాంపేట వాటర్ ట్యాంక్ నుంచి జర్నలిస్ట్ కాలనీ మీదుగా బాచుపల్లి గండిమైసమ్మ రహదారికి వెళ్లే మార్గం ఇప్పుడు వాహనదారులకు నరకం అంటే ఏమిటో పరిచయం చేస్తోంది. ప్రముఖ విద్యా సంస్థలు, కార్పొరేట్ సంస్థలు, బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్ కమ్యూనిటీలు, సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు యూనివర్సిటీతో పాటు డబుల్ బెడ్రూమ్, రాజీవ్ గృహకల్ప.. ఇలా ఎన్నో కాలనీలు, బస్తీలకు వెళ్లేందుకు ఈ మార్గం ఎంతో సుగమం అన్నది అక్షరాల నిజం. అయితే ఈ రహదారిలో రెండుచోట్ల వాహనదారుల అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి.డబుల్ బెడ్రూమ్ ఇళ్లను ఆనుకునే ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇళ్ల వద్ద ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్తతో ఒక సమస్య అయితే, రోడ్డు ప్రవేశద్వారం సమీపంలో శ్రీరామకుంట చెరువును ఆనుకుని డ్రైనేజీ నిర్మాణంలో భాగంగా తవ్వేసిన రోడ్డు మరో కారణం. ఈ రెండుచోట్ల పడరాని కష్టాలను వాహనదారులు అనుభవిస్తున్నారు. ట్రాఫిక్ స్తంభించిపోయి కిలోమీటర్ల మేర వాహనదారులు నిలిచిపోయే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. ఎందుకొచ్చాం..రా ఈ రోడ్డులోకి అంటూ వాహనదారులు అసహనానికి గురయ్యే పరిస్థితులు ఇక్కడ నెలకొన్నాయి. ఒకవైపు డంపింగ్ యార్డును తరలించాలనే ఎన్నో ఏళ్లుగా డిమాండ్ వెల్లువెత్తుతున్నా.. డంపింగ్ యార్డును తొలగించడం మాట అటుంచితే ప్రధాన రోడ్డును కూడా చెత్తతో నింపేయడం వాహనదారుల ఆగ్రహానికి గురిచేస్తోంది. ప్రతిరోజూ పరిస్థితి ఇలాగే ఉంటుండడంతో ఆ మార్గంలో వెళ్లేవారు తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితి. మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఒకవేళ చూసినా ఆ ఏముందిలే.. ఇబ్బందులు పడేది జనమే కదా..? మనం కాదులే అన్న ధోరణితో వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకరోజు కాకపోతే మరొక రోజైనా రోడ్డుపై చెత్తను తరలించి రాకపోకలను సుగమం చేస్తారనుకుంటే కనీసం అధికారులు పట్టించుకోకపోవడంపై వాహనదారులు దుమ్మెత్తి పోస్తున్నారు. ప్రతిరోజూ ఆ మార్గంలో వెళ్లేవారికి దుర్వాసనతో ముక్కుపుటాలు అదిరే బాధ ఒకటైతే.. రోడ్డుపై అడ్డగోలుగా పడేసిన చెత్త బాధ మరొకటి.. వెరసి వాహనదారులు, స్థానికులు అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఒక మరోవైపు ఈ రోడ్డులోనే శ్రీరామకుంట చెరువు వద్ద జరుగుతున్న డ్రైనేజీ పైప్లైన్ల నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో అక్కడ కూడా వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ప్రధానమైన ఈ రోడ్డులో నెలకొన్న సమస్యలను పట్టించుకుని రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితి లేకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

పవన్ కళ్యాణ్ మాటలను వక్రీకరిస్తున్నారు : ప్రచార కార్యదర్శి ఆర్కే సాగర్

జూబ్లీహిల్స్, జూన్ 6, ప్రభాతవార్తః

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సాగర్ తదితర జనసేన నేతలు.

జనసేన అధినేత, ఎపి డిసిఎం పవన్‌కళ్యాణ్ మాటలను రాజకీయ నాయకులు వక్రీకరిస్తున్నారని ఆ పార్టీ ప్రచార కార్యదర్శి సాగర్ అన్నారు. జూబ్లీహిల్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ నీ అయ్య జాగిరా అని పవన్ కళ్యాణ్ మాట్లాడింది రాజకీయ నాయకులను ఉద్దేశించి అన్నారు. ఆ మాటలను కావాలని ప్రజలకు ఆపాదించి రాజకీయంగా కొందరు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. టీఆర్ఎస్ అధినేత్రి కవిత తీహార్ జైలులో చిప్పకూడు తిన్నదంటూ ఆయన ఎద్దేవా చేశారు. అలాంటి ఆవిడ సైతం పవన్‌ను ఉద్దేశించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ జాగృతి పేరుతో కోట్ల రూపయాల వసూలుకు పాల్పడిందని ఆరోపించారు. హిమాయత్‌నగర్‌లో బ్యూటీపార్లర్ నడిపింది నిజం కాదా అని కవితను ప్రశ్నించారు. కేటీఆర్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ నోర్లు అదుపులో పెట్టుకోవాలన్నారు. నిజంగా పవన్‌కళ్యాణ్ చెరువును కబ్జా చేసి స్థలాన్ని కొనుగోలు చేసినట్లు రుజువైతే ప్రభుత్వానికి తిరిగి అప్పగించేందుకు సిద్దంగా ఉన్నారన్నారు. పవన్‌కళ్యాణ్‌పై మాట్లాడుతూ రాజకీయ నేతలు తమ ఆస్తులను బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. గద్దర్ కుమార్తె వెన్నలకు పవన్‌కళ్యాణ్ గురించి బాగా తెలుసని అన్నారు. గద్దర్‌ను ఉద్దేశించి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ వ్యతిరేకి అన్న విషయాన్ని వెన్నెల తెలుసుకోవాలన్నారు. గద్దర్‌ను రోడ్డుపై నిలబెట్టిన కుటుంబం నీతులు మాట్లాడుతుందని వ్యాఖ్యానించారు. పవన్‌కళ్యాణ్‌ను అంటే తెలంగాణ బిడ్డలను అన్నట్లేనని, ఆయన పక్కన ఉన్న తామంతా తెలంగాణ బిడ్డలమే అన్నారు. సమావేశంలో పలువురు జనసేన నేతలు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగులకు ఆరోగ్య భద్రత నెలవారి చందా నిలిపివేత - జీఓను విడుదల చేసిన ప్రభుత్వం

'వార్త'కు స్పందన..

జూబ్లీహిల్స్, జూన్ 6, ప్రభాతవార్తః పోలీసు ఆరోగ్యానికి.. 'రెండు కోతలు' పేరుతో వార్త పత్రికలో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. ఆరోగ్య భద్రత కోసం నెలవారి రుసుం సేకరణను నిలిపివేస్తున్నట్లు జీవోను విడుదల చేసింది. పోలీసు శాఖ ఉద్యోగుల వేతనాల నుంచి ఒకవైపు కొత్తగా అమల్లోకి వచ్చిన ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్(ఈహెచ్‌సిటి) కోసం 1.5 శాతం కోత విధిస్తుండగా, మరోవైపు ఆరోగ్య భద్రత పథకం పేరుతో నెలవారీ చందా వసూలు చేస్తుంది. ఈ క్రమంలోనే జూన్ నెలలో పోలీసు ఉద్యోగులను ఒకవైపు ఎంప్లాయిస్ హెల్త్ స్కీం కింద డబ్బులు కత్తిరించగా, మరోవైపు ఆరోగ్య భద్రత కింద సైతం డబ్బులు కత్తిరించారు. ఈ అంశంపై వార్త కథనం ప్రచురితమైంది. దీనికితోడు ఉద్యోగులు, పోలీసు సంఘాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, పోలీసు శాఖ అప్రమత్తమై వెంటనే స్పందించాయి. ఇప్పటికే ఈహెచ్‌సిటి పథకం కోసం ఉద్యోగుల ప్రాథమిక వేతనం నుంచి 1.5 శాతం మొత్తాన్ని మినహాయిస్తున్నందున, ఇకపై ఆరోగ్య భద్రత పథకం కింద వసూలు చేస్తున్న నెలవారీ చందాను నిలిపివేయాలని నిర్ణయించాయి. దీనికి సంబంధించిన ఉత్తర్వులను పోలీసు శాఖ విడుదల చేసింది. ఇప్పటి వరకు కానిస్టేబుల్ నుంచి సబ్‌ఇన్‌స్పెక్టర్ స్థాయి వరకు నెలకు రూ.300, ఇన్‌స్పెక్టర్, అంతకంటే పైస్థాయి అధికారుల నుంచి రూ.400 చొప్పున ఆరోగ్య భద్రత చందా వసూలు చేసేవారు. ఇకపై ఈ వసూళ్ల నిలిపివేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో పోలీసు ఉద్యోగులు, పెన్షనర్లపై అదనపు ఆర్థిక భారం తగ్గనున్నట్లు భావిస్తున్నారు.

బోనాల జాతర పెండింగ్ పనులు పూర్తి చేయాలి

జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డిని సత్కరిస్తున్న మల్యాల మధుసూధన్ యాదవ్

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 6 ప్రభాతవార్త : పాతబస్తీలో పూర్తి కాని గత సంవత్సరం బోనాల జాతర ఉత్సవాలకు సంబంధించిన పెండింగ్ పనులను పూర్తి చేయాలని కోరుతూ భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల కమిటి చైర్మన్ మల్యాల మధుసూధన్ యాదవ్ రాజేంద్రనగర్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డిని కోరారు.ఊరేగింపు కమిటి నూతన చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా మల్యాల మధు సూధన్ యాదవ్ శనివారం రాజేంద్రనగర్ జోన్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.రాజేంద్రనగర్ జోన్ పరిధి చాంద్రాయణగుట్ట,బహదూర్‌పుర నియోజకవర్గాల పరిధిలోని దేవాలయాల వద్ద పెండింగ్‌లో ఉన్న గత సంవత్సరానికి సంబంధించిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ ఏడాది జరగనున్న బోనాల జాతర ఉత్సవాలు ప్రారంభానికి ముందే అభివృద్ధి పనులకు శ్రీ కారలం చుట్టాలని ఆయన కోరారు.జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని కలిసిన వారిలో ఉమ్మడిదేవాలయాల ఊరేగింపు కమిటి మాజీ చైర్మన్ గోపిశెట్టి రాఘవేందర్,బుల్లెట్ శ్రీధర్,నాగరాజు ఉన్నారు.



శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన అంతర్జాతీయ భగవద్గీత పద్య పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో నిర్వాహకులు

ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

సరూర్‌నగర్, జూన్ 6 ప్రభాతవార్త:

ఆర్థిక ఇబ్బందులను భరించలేని ఓ ఆటో డ్రైవర్ జీవితంపై విరక్తి చెంది ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటక రాష్ట్ర బీదర్ ప్రాంతానికి చెందిన లాల్ అహ్మద్ (35) జీవనోపాధి కోసం నగరానికి వచ్చి పహాడీషరీఫ్ సమీపంలోని షాజహాన్ కాలనీలో భార్య, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నాడు. అయితే మొదట్లో సెంట్రింగ్ కార్మికునిగా ఉన్న అహ్మద్ ఆ తర్వాత ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అయితే అప్పులు ఉన్న అతనికి వాటిని తీర్చలేక జీవితంపై విరక్తి పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో బాలాపూర్ పిఎస్ పరి ధిలోని నిర్మానుష్య ప్రదేశంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై అనుమానంతో హత్య ..భర్త అరెస్ట్

దుండిగల్, జూన్ 6, ప్రభాతవార్త

భార్యపై అనుమానంతో భర్త హత్యకు పాల్పడిన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా గాగిళ్లపూర్ చర్చి ప్రాంతానికి చెందిన అయ్యగారి సంతోష్ కుమార్ చారి (44) తన భార్య సంతోషి (38)కి 21 ఏళ్ల క్రితం వివాహం కాగా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్యపై అనుమానం పెంచుకున్న సంతోష్ కుమార్ చారి ఇతరులతో మాట్లాడుతుండటాన్ని అక్రమ సంబంధంగా భావించాడు. కాగా జూన్ 5న ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గొడ్డలితో దాడి చేసి హత్య చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన దుండిగల్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది.ఈ కేసును త్వరితగతిన ఛేదించిన దుండిగల్ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

పది రోజుల కస్టడీకి నేపాలి గ్యాంగ్ నిందితులు

జూబ్లీహిల్స్, జూన్ 6, ప్రభాతవార్తః

మాజీ ఐపీఎస్ వినయ్ రంజన్ రే సతీమణి తనూజ రంజన్ హత్య, దోపిడి కేసులో అరెస్ట్ అయిన ఇద్దరు నిందితులను జూబ్లీహిల్స్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. మే 8న జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో మాజీ ఐపీఎస్ వినయ్ రంజన్ రే సతీమణి తనూజ రంజన్‌ను ఇంట్లో పనిచేసే నేపాల్‌కు చెందిన కల్పనతోపాటు మరో ముగ్గురు నేపాలి ముఠా కలిసి హత్య చేసి దోపిడికి పాల్పడిన విషయం విదితమే. ఈ కేసులో మొత్తం 9 మంది నిందితులు ఉండగా అందులో హత్యకు పాల్పడిన వారిలో ఒకరైన సునీల్ పరియార్‌తోపాటు ముంబైలో ఆభరణాలను కొనుగోలు చేసిన దిలీప్‌లను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మిగిలిన నిందితుల జాడ చిక్కకపోవడంతో పోలీసులు ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు వారిద్దరిని కస్టడీ కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలోనే కోర్టు పది రోజుల పాటు కస్టడీకి అనుమతించడంతో నిందితులిద్దరిని జూబ్లీహిల్స్ ఠాణాకు తరలించి విచారిస్తున్నారు. సంఘటనకు ముందు వేసిన స్కెచ్ నుంచి మొదలుకొని సంఘటన జరిగిన తరువాత ఎవరు, ఎలా, ఎక్కడికి పారిపోయారు అనే అన్ని అంశాలపై ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో విచారిస్తున్నారు. ఈ కేసులో తప్పించుకున్న ప్రధాన నిందితుల జాడకు సంబంధించిన వివరాలను ప్రధానంగా సేకరిస్తున్నారు.

రాష్ డ్రైవింగ్ చేసిన ఆటోడ్రైవర్‌పై కేసు

చాంద్రాయణగుట్ట, జూన్ 6, ప్రభాతవార్త : పరిమితికి మించి ప్రయాణికులతో రాష్ డ్రైవింగ్ చేసిన ఒక ఆటోడ్రైవర్‌పై చాంద్రాయణగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు వైరల్ కావటంతో పోలీసులు అతనిపై కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపి తెలిపిన వివరాల ప్రకారం... కొత్తపేట్ బిస్మిల్లా కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ అబ్దుల్ హమీద్ ఖాన్ (35) ఈనెల 4వ తేదీ రాత్రి తన ఆటో (టిఎస్13యు సి3818)లో పరిమితికి మంచి ప్రయాణికులను ఎక్కించుకొని బార్కాస్ నుండి సాదత్ నగర్ వెళుతున్నాడు. ఆటోబయట ముగ్గురు యువకులు వేలాడుతుండగా మరో ఐదుగురు లోపల కూర్చున్నారు. మితి మీరన వేగంతో వెళుతున్న ఆటోపై వేళాడుతున్న యువకుల వీడియోలు సామాజిక మాధ్యమంలో వైరలైయ్యాయి. దీంతో పోలీసులు సుమోటో కేసుగా స్వీకరించి ఆటోడ్రైవర్ అబ్దుల్ హమీద్ ఖాన్‌పై 125 బిఎన్ఎస్ యాక్ట్, 184 ఎంవిఐ యాక్ట్ కింద ఈనెల5న కేసు నమోదు చేశారు. తాను తప్పు చేశా నని,తనలా మరో ఆటోడ్రైవర్ పరిమితికి మించి ప్రయాణికు లను ఎక్కించుకొని రాష్ డ్రైవింగ్ చేయవద్దని ఇన్‌స్పెక్టర్ గోపి, ఎస్సైలు శ్రీనివాస్‌రావు, కిరణ్‌కుమార్ల సమక్షంలో వేడుకున్నాడు.

అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామాభివృద్ధి, పరిశుభ్రతపై అవగాహన

కొమురవెల్లి, జూన్ 6,ప్రభాతవార్త: మండల పరిధిలోని రాంసాగర్‌లో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అక్కెనపల్లి రాజ్యలక్ష్మి మల్లారెడ్డి గ్రామ పరిశుభ్రత, తాగునీటి సంరక్షణ, పన్నుల చెల్లింపు, వర్షాకాలంలో కాలువల శుభ్రత తదితర అంశాలపై ప్రజలు అవగాహన కల్పించారు. ఎంపివో శ్రీనివాస్‌వర్మ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి విద్య,ఉపాధి, సమాజ సేవలో ముందుండాలన్నారు. ఎపిఎం లింగం మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి వెంకటరామమ్మ మాట్లాడుతూ పంట అవశేషాలను కాల్చవద్దన్నారు. అవశేషాలను కాల్చడం వల్ల వాయు కాలుష్యం పెరగడంతోపాటు నేల సారవంతం తగ్గి పంట దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. గ్రామానికి చెందిన తాడూరి హరిబాబు ఇండియన్ ఆర్మీకి సెలెక్ట్ కావడంతో సర్పంచ్,మండల అధికారుల చేతుల మీదుగా సత్కారించారు. కార్యక్రమంలో ఆర్ఐ నర్సింలు, కార్యదర్శి కరుణాకర్,ఏఈ మేఘన,ఉప సర్పంచ్.గ్రామ పంచాయతీ, ఐకెపి, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

డిప్యూటీ తహసీల్దార్ మధుకర్

చిన్నకోడూరు, జూన్ 6, ప్రభాతవార్త : గ్రామాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని డిప్యూటీ తహసీల్దార్ మధుకర్ కోరారు. మండల పరిధిలోని ఎల్లాయిపల్లి, చెలుకలపల్లి, అల్లీపూర్, కిష్టాపూర్ గ్రామాల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎల్లాయిపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాన్నారు.శుభ్రమైన తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమాలలో సర్పంచ్‌లు సిద్దుల రాజు, నాగార్జునరెడ్డి, కుంభాల మనమ్మ, రాజురెడ్డి, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎఎంసి వైస్ చైర్మన్ రాజశేఖర్‌కు సన్మానం

ఎఎంసి వైస్ చైర్మన్ రాజశేఖర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

చిన్నకోడూరు, జూన్ 6, ప్రభాతవార్త: సామాజిక న్యాయం అన్ని వర్గాల అభివృద్దే లక్ష్యంగా కాంగ్రెస్‌సర్కార్ ముందుకు సాగుతుందని చిన్నకోడూరు ఎఎంసి వైస్ చైర్మన్ బుస్స రాజశేఖర్ అన్నారు. చిన్నకోడూరులో శనివారం టిపిసిసి జిల్లా అధ్యక్షులు, ముదిరాజ్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఎఎంసి చైర్మన్ రాజశేఖర్‌ముదిరాజ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ ముదిరాజ్‌లకు సముచిత గుర్తింపు కల్పిస్తూ పెద్దపీట వేస్తుందన్నారు. ముదిరాజ్‌ల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ సర్కార్ కృషి చేస్తుందన్నారు. తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి హరికృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు చెరుకు పెద్దులు, కోరబోయిన సుధాకర్, ఇట్టబోయిన బాల పోచయ్య, కోరబోయిన శ్రీనివాస్, దశరథం, అంబటి కనకయ్య,కొత్త బాల రాజు, రవి, శరత్, బాబు, వికాస్, రోహిత్, చంద్రం, ఎల్లం, హరిబాబు, రవి, శ్రీనివాస్, రాజేష్, నరేష్, దత్తు,మహిపాల్, అరవింద్ పాల్గొన్నారు.

పర్యావరణ హిత జీవనశైలిపై అవగాహన

ములుగు, జూన్ 6 ప్రభాతవార్త : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ములుగు ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సిఆర్ఐ) ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం–2026 సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ వినియోగంవల్ల ప్రకృతి,జీవవైవిధ్యంపై పడుతున్న ప్రభావాలను వివరించారు. రోజువారి జీవితంలో పర్యావరణానికి మేలు చేసే అలవాట్లు పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని, వ్యర్థాల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. యువతలో సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు పర్యావరణ పరిరక్షణ అంశంపై డిజిటల్ పోస్టర్ పోటీ నిర్వహించగా విద్యార్థులు వినూత్న ఆలోచనలతో పోస్టర్లను రూపొందించారు. ప్రకృతి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని విద్యాసంస్థల నుంచే పర్యావరణ చైతన్యం ప్రారంభం కావాలని కార్య క్రమంలో పేర్కొన్నారు.

ధాన్యం నిల్వకు శ్రీలక్ష్మి మిల్ గోదాం అందుబాటులోకి

బెజ్జంకి, జూన్ 6, ప్రభాతవార్త : మండలంలోని కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యం తరలింపులో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో రైతులకు ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టారు. ఈ సమస్యను మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. దీంతో తోటపల్లి పరిధిలోని శ్రీలక్ష్మి మిల్‌లో ఉన్న 25,000 క్వింటాళ్ల సామర్థం గల గోదాంను ధాన్యం నిల్వ కోసం అందుబాటులోకి తీసుకువచ్చారు. గోదాం ప్రారంభం కావడంతో కొనుగోలు కేంద్రాల వద్ద పేరుకుపోయిన ధాన్యాన్ని నిల్వచేయడానికి అవకాశం ఏర్పడిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధాన్యం నిల్వ సమస్యకు తాత్కాలిక పరిష్కారం లభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

ఏబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవులపల్లి మహేందర్

గజ్వేల్, జూన్ 6 (ప్రభాతవార్త): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏబివిపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు దేవులపల్లి మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఏబివిపి ఆధ్వర్యంలో ఆయన మాట్లాడుతూ వారం రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వపాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి సమస్యలను పరిష్కరించాలని, అలాగే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని నియంత్రించాలని, అనుమతిలేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించి పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో వసూలు చేస్తున్న ఫీజులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబివిపి కార్యదర్శి గురు, నవీన్, చందు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దేవులపల్లి మహేందర్

ప్రభుత్వ నిర్లక్ష్యానికి రైతు కనకయ్య బలి

మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:
ప్రభుత్వ నిర్లక్ష్యమే రైతు కనకయ్యను బలి తీసుకుంది మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేటకు చెందిన రైతు పల్లెవేని కనకయ్య(గద్దర్) గుండెపోటు మృతి చెందగా శనివారం హరీష్‌రావు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కనకయ్య మృతి కాంగ్రెస్ సర్కార్...రేవంత్‌రెడ్డి హత్యేనని ఆరోపించారు. పండించిన పంటను 45 రోజులుగా కొనుగోలు చేయకపోవడంతో వర్షంలో వడ్లు తడవడంతో కనకయ్య ఆవేదనకు గురయ్యారని తెలిపారు. తడిచిన వడ్లు కొనాలని ప్రాధేయ పడితే 40 సంచులు కట్ చేశారని దీంతో కలత చెందిన కనకయ్య గుండెపోటుతో మృతి చెందారని తెలిపారు.రైతులు పండించిన పంట కొనక రైతులను బలి తీసుకుంటున్నారని మండిపడ్డారు. రెండు నెలల నుంచి కొనుగోలు కేంద్రాలలో వడ్లు పోసుకొని ఎదురు చూస్తున్న రైతుల గోస కనబడడం లేదని సిఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు.దుబ్బాక నియోజకవర్గం చేర్యాపూర్‌లో సంచులు ఎత్తకపోవడంతో చెదలు పట్టిన పరిస్థితి వచ్చిందన్నారు. మంత్రి రాజనర్సింహ నియోజకవర్గంలని వెంకటాపూర్‌లో నేటికీ ఒక్క క్వింటాళు కొనలేదన్నారు.మరణించిన కనకయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎలాంటి కోతలు లేకుండా వడ్లను తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు కాంగ్రెస్ సర్కార్ చేసింది ఏంటో ఒక్కటి చెప్పాలని సిఎంకు సవాల్ విసిరారు. ఎరువుల సరఫరాలో విఫలం...రైతుబంధు ఇవ్వడంలో ఫెయిల్.. రైతులు చనిపోతే రైతు బీమా అందించడం లేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నేను మళ్లీ గెలుస్తా...తొక్కుతా పండబెడతా తొండల బాష.. తొత్తిరి భాష మాట్లాడుతున్నారని మండిపడ్డారు.కనకయ్య కుటుంబానికి అండగా ఉంటామన్నారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. మాటలు కట్టిపెట్టి ఎలాంటి కోతలు లేకుండా యుద్దప్రాతిపదికన వడ్లను తక్షణమే కొనుగోలు చేయాలన్నారు. ఆయన వెంట బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు ఉన్నారు.



బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చుతున్న హరీష్‌రావు

ప్రభుత్వ పాఠశాలల్లో 8,577 మంది విద్యార్థుల నమోదు లక్ష్యం

బడిబాట కార్యక్రమంపై జిల్లా విద్యాశాఖ సమీక్ష సమావేశం

సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా టిటిఆర్‌సి భవనంలో జిల్లా విద్యాధికారి వి.శాస్త్రి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, సీఆర్‌పీలతో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన ఈ సమావేశంలో విద్యాశాఖకు సంబంధించిన పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా బడిబాట కార్యక్రమం, విద్యార్థుల నమోదు, పాఠశాల పని తీరు సూచిక(పీజీఐ), యూడైస్ ప్లస్ 202627 డేటా నమోదు, పాఠ్యపుస్తకాల పంపిణీ, యూనిఫాంల పంపిణీ, జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలు,15 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. గత విద్యా సంవత్సరంలో జిల్లాలో 81,329 మంది విద్యార్థులు ప్రభుత్వపాఠశాలల్లో నమోదు కాగా, ఈ ఏడాది 10 శాతం అదనంగా అంటే 8,577 మంది విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని లక్ష్యంగా నిర్ణయించి నట్లు జిల్లా విద్యాధికారి తెలిపారు. సమావేశంలో ప్లానింగ్ కో ఆర్డినేటర్ పి.రామస్వామి, సీఎంఓ రంగనాథ్, జెండర్ కోఆర్డినేటర్ నర్మదా పాల్గొన్నారు.

ఎన్‌ఎఫ్‌బిఎస్ దరఖాస్తులను ఎంపిడివో తీసుకోవాలి

-డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి

గజ్వేల్ టౌన్, జూన్ 6 (ప్రభాతవార్త): నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం (ఎన్‌ఎఫ్‌బిఎస్) దరఖాస్తు ఫారంలు తహసీల్దార్ కార్యాలయంలో ఇస్తే ఎంపిడివో కార్యాలయానికి పోవాలని, ఎంపిడివో కార్యాలయంలో ఇస్తే తహసీల్దార్ కార్యాలయంకు పోవాలని అధికారులు దరఖాస్తుదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ యజమాని మరణించి కుటుంబ పోషణ భారమవుతున్న పరిస్థితుల్లో ఆ కుటుంబాలను ఆదుకోవడానికి ఇచ్చే ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం అర్హులకు అందివ్వాలని, దరఖాస్తు చేసే క్రమంలో లబ్ధిదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు సరైన సమాచారాన్ని ఇచ్చే విధంగా ఆదేశాలివ్వాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్, ఏట ఎంపిడివో కార్యాలయంలోనే ఇవ్వాలని సూచించడం జరిగిందని తెలిపారు.

తూతూ మంత్రంగా గ్రామసభలు

సభలకు హాజరుకాని అన్ని శాఖల అధికారులు

కొండపాక, జూన్ 6 ప్రభాతవార్త : మండల పరిధిలోని కొండపాక, దమ్మక్కపల్లి, సిర్సనగండ్ల, గిరాయిపల్లి, కుకునూరుపల్లి మండల పరిధిలోని రాయవరం, పిటి వెంకటపూరం, ఎల్లాయిగూడ గ్రామాల్లో శనివారం గ్రామ సభలు నిర్వహించారు. సర్పంచుల అధ్యక్షతన సభలు నిర్వహించారు. సభల్లో పాలకవర్గం పలు తీర్మానాలను చేశారు. కాని సభలకు అన్ని శాఖల అధికారులు హాజరు కాకపోవడంతో గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని అంటున్నారు. ముఖ్యంగా మరో వారం రోజుల్లో వర్షాకాలం మొదలు కానుండడంతో సాగునీటిపై, ప్రస్తుతం ఎండాలు తీవ్రంగా ఉండడంతో తాగు నీరుపై, పిర్యాదు చేయడానికి సంబంధిత శాఖల అధికారులు సభలకు హాజరుకాకపోవడంతో ఫలితం ఎమిటని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. అన్ని శాఖల అధికారులు గ్రామసభలకు హాజరు కావాలని ఉత్తర్వులున్నప్పటికి వాటిని తుంగలోతొక్కి గైరజరవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకొని గ్రామ సభలకు అన్ని శాఖల అధికారులు హాజరయ్యేల చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

చిన్నశంకరంపేట, జూన్ 6,ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని గజగట్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాలయ్య తెలిపారు. శనివారం గజగట్లపల్లిలో గ్రామ ప్రత్యేక అధికారి వాసుదేవరావు ఆధ్వర్యంలో సర్పంచి నాగభూషణం అధ్యక్షతన ప్రజాపాలన-ప్రగతిపాలనలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. సభలో ఇరిగేషన్ డిఈ ధర్మకుమార్ పాల్గొని పలు విషయాలపై మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు గాలయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్,మధ్యాహ్న భోజనంతో పాటు ఈ విద్యా సంవత్సరం నుండి రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు 25 రకాల వస్తువులను అందిస్తారని తెలిపారు. తల్లితండ్రులు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి వాసుదేవరావు, పంచాయతీ కార్యదర్శి సంతోష్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐను కలిసిన ఎన్‌హెచ్‌ఆర్‌సి సభ్యులు

చిన్నకోడూరు, జూన్ 6, ప్రభాతవార్త : జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సభ్యులు, ప్రతినిధులు శనివారం చిన్నకోడూరులో ఎస్సై చంద్రమోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి అన్యాయం జరగకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా పనిచేయడంతో పాటు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేవిధంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసు శాఖతో సమన్వయంగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిటీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నెమలి సుభాష్‌గౌడ్, ఉపాధ్యక్షులు ప్రభురాజ్, ఎర్రవెల్లి సంపత్, కార్తీక్ రెడ్డి, రాములు, సునీత, సుజాత, వెంకటలక్ష్మి, రాజేష్‌గౌడ్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే

చిన్నశంకరంపేట, జూన్ 6,ప్రభాతవార్త: పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. శనివారం చిన్నశంకరంపేటలోని రాధే శ్యాం కళ్యాణ మండపంలో 115 మంది లబ్దిదారులకు రూ.1,05,12,480 కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే రోహిత్‌రావు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడపడుచులకు కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలు ఆర్థికంగా ఎంతో తోడ్పాటును అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మోహన్‌నాయక్, సర్పంచి చంద్రశేఖర్, నాయకులు రాజిరెడ్డి, గోపాల్ రెడ్డి, గణేష్, తహసీల్దార్ మాలతి, ఆర్ఐ రాజు సర్పంచులు, పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు బోరు వేయించిన ఎమ్మెల్యే...

చిన్నశంకరంపేట, జూన్ 6,ప్రభాతవార్త: చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లి తండా, మాందాపూర్, పాటిగడ్డ తండాలలో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో గ్రామస్థులు మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు దృష్టికి తిసుకెళ్లగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మైనంపల్లి సోషల్ సర్వీస్ ద్వారా సోంత నిధులు రూ.6.50లక్షలతో ఏర్పాటు చేయించారు.గ్రామంలో నీరు పుష్కలంగా పడడంతో శనివారం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి వాటిని ప్రారంభించారు. తమ గ్రామంలో మంచి నిటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేను గ్రామస్థులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత : సర్పంచ్

మర్కుక్, జూన్ 6 (ప్రభాతవార్త): పరిశుభ్రత మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సర్పంచ్ పుట్ట రామరాజు తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని గణేష్‌పల్లి గ్రామంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వానాకాలం దృష్టిలో పెట్టుకొని గ్రామంలో పారిశుద్ధ్య నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ఇంటి వద్దకు వచ్చే చెత్త బండిలో వేయాలని కోరారు. గ్రామ అభివృద్ధిలో మహిళలు, యువత భాగస్వాములు కావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యమే మహా భాగ్యంగా భావించి ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. గ్రామంలో ప్రజల సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కారానికి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్సింలు, ఎంపివో అమీనాబేగం, కార్యదర్శి కవిత, వార్డు సభ్యులు అక్కమ్మ, కవిత, స్వామి, కనకయ్య, సుమతి, నాగరాజు, అంగన్వాడీ టీచర్ కవిత, ఆశవర్కర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ఎన్‌సిసి విద్యార్థుల ర్యాలీ

సిద్దిపేట అర్బన్, జూన్ 6, ప్రభాతవార్త : ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా, పర్యావరణ మహోత్సవాన్ని పురస్కరించుకుని నాట్కో ఇందిరా నగర్ పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం పర్యావరణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో "ప్లాస్టిక్ వద్దు పేపర్ ముద్దు" అనే నినాదాలతో విద్యార్థులు పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, పర్యావరణ హిత వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి సమన్వయకర్త రవీందర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల మాటల్లో తప్ప చేతల్లో చేయడం లేదు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

సిద్దిపేట రూరల్, జూన్ 6, ప్రభాతవార్త :
కాంగ్రెస్ వాళ్లవి మాటల్లో తప్ప చేతల్లో ఏమీ లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని విపంచి కళా నిలయంలో శనివారం సామాజిక సేవకులు, ఎమ్మెల్సీ అమీర్‌ఖాన్ సహకారంతో తురక కాశా కులస్తులకు పనిముట్లను పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకు మోసమే జరుగుతుందన్నారు. రైతులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ముస్లింల సంక్షేమానికి కాంగ్రెసొళ్లు 4 వేల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టామని చెప్పి కనీసం 1100 కోట్లు కూడా ఖర్చు చేయలేదన్నారు. తురక కాశల్లకు రావాల్సిన 5 కోట్ల రూపాయలు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. నిధులు విడుదలయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ విషయంపై సంబంధితశాఖ మంత్రితో పాటు ప్రభుత్వ సెక్రటరీతో మాట్లాడి అసెంబ్లీలో గళమెత్తుతానని చెప్పారు. తురకకాశలు అధైర్య పడాల్సిన అవసరం లేదని రానున్నది కెసిఆర్ సర్కారేనని తెలిపారు. రూ. 5 కోట్ల నిధులను కెసిఆర్ ప్రభుత్వంలో రూ.50 కోట్లకు పెంచుతామన్నారు.మండుటెండల్లో బండరాళ్లను పగలకొడుతూ తురక కాశోళ్ల తమ జీవితాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. తురక కాశోళ్ల జీవితాల్లో వెలుగులు రావాల్సిన అవసరం ఉందన్నారు. బిఆర్ఎస్ పాలనలో ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేశామన్నారు. కాశ తురకల పిల్లలు బండరాళ్లలో కాదు పుస్తకాల్లో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అమీర్‌ఖాన్, మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్, బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



తురక కాశా కులస్తులకు పని ముట్లు పంపిణీ చేస్తున్న హరీష్‌రావు

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు...

వచ్చే వానాకాలం సీజన్‌కు ముందస్తు చర్యలు తీసుకోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఇరిగేషన్ అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎస్ఈ ఇరిగేషన్, ఈఈ, డిఈలతో పెండింగ్ పనులపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో నిర్మించే చంద్లాపూర్ లిఫ్ట్, సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడ్ వద్ద నిర్మించే ఇర్కోడ్ లిఫ్ట్ పనుల్లో జాప్యం జరుగుతుందని పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గోలాపూర్ చెక్ డ్యామ్,కస్తూరిపల్లి చెక్ డ్యాం పనులు ఇంకా ప్రారంభం కాలేదని వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. మిట్టపల్లి గుండ్ల చెరువుకి వెళ్లే బ్రిడ్జి పనులు,రాఘవాపూర్ ఇంద్రగూడెం పల్లె కుంట పనులు, ముండ్రాయి మెరుపుకుంట పనులు వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. నారాయణరావు పేట మండలం మల్కచెరువు వద్ద ఎల్ఎంసి ఆర్‌డిబిలోపలి నుంచి పైప్ లైన్ వేయాలని దీంతో కింద గ్రామాలకు నీరు అందుతుందన్నారు. చిన్నకోడూరు మండలం రంగాయిపల్లి ఎల్ఎంసి ఎల్ఎస్ఎం-1 కెనాల్ లైనింగ్ స్ట్రక్చర్స్ వెంటనే పూర్తి చేయాలన్నారు.పాలమాకుల ఊర చెరువకు బ్లాస్టింగ్ పనులు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ సుధాకిరణ్, ఈఈలు వీరస్వామి, రమేష్ జాదవ్, శంకర్, సదయ్య, డిఈ, ఏఈలు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గాడిపల్లి భాస్కర్

చెత్త సేకరణ పేరిట ప్రజలపై అదనపు భారం వేయొద్దు

గజ్వేల్, జూన్ 6 (ప్రభాతవార్త): మున్సిపల్‌లో ఇప్పటికే పన్నులు, నల్లా బిల్లులు, ఇతర సేవల ఛార్జీలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై చెత్త సేకరణ పేరుతో మరో భారం మోపడం మంచిదికాదని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బిజెపి పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్‌లు విమర్శించారు. శనివారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్త సేకరణకు డబ్బులు వసూలు చేస్తామనడం పద్ధతి కాదని, చెత్త సేకరణను మున్సిపాలిటీయే భరించాలన్నారు. ప్రైవేట్ సంస్థలకు చెత్త సేకరణను అప్పగిస్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, పేర్ల శ్రీనివాస్, నాయిని సందీప్, మద్దూరి నర్సింహ, వెంకట్‌రెడ్డి, నాగుముదిరాజ్, మహిపాల్‌రెడ్డి, పిట్ల శ్రీనివాస్, మంద వెంకట్, హరికుమార్, జోడు ప్రకాష్, కొమ్ము చంద్రశేఖర్, ఆంజనేయులు, కాళ్ల సాయికుమార్, సందిరి రాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : కౌన్సిలర్

గజ్వేల్, జూన్ 6 (ప్రభాతవార్త): ప్రజాపాలన పట్టణ ప్రగతిలో భాగంగా శనివారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో కౌన్సిలర్ నక్క సంతోష రాములుగౌడ్ ఆధ్వర్యంలో వార్డుసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నక్క సంతోషరాములుగౌడ్ మాట్లాడుతూ సంగుపల్లిలో అండర్ డ్రైనేజీ లేదని, మురికికాల్వలు సరిగా లేవని, వీటిని పరిష్కరించేందుకు మున్సిపల్ కమిషనర్ గణేష్ చొరవ చూపాలన్నారు. యుజిడి కనెక్షన్ ఇవ్వకపోవడంవల్ల దుర్వాసన వస్తుందని, మోరీలలో ఎత్తిన చెత్తను త్వరగా తొలగించాలని అధికారులను కోరారు. అలాగే వర్షం పడితే బురదమయం, నడవలేని స్థితిలో గల్లీ రోడ్లు ఉన్నాయని, సిసి రోడ్లు వేయించాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం వార్డులో ఉన్న సమస్యల గురించి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన

హుస్నాబాద్ రూరల్, జూన్ 6, ప్రభాతవార్త : మండలంలోని పందిల్ల గ్రామ ప్రాథమిక పాఠశాలలో శనివారం వరాహ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయంలో ఆరుతడి విధానాన్ని అమలు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు సాగు ఖర్చులను నియంత్రించి, అధిక దిగుబడులు సాధించవచ్చని నిపుణులు రైతులకు వివరించారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరాన్ని, వరి సాగులో నీటి నిర్వహణకు సంబంధించిన పలు సూచనలు చేశారు. సుస్థిర వ్యవసాయ పద్ధతులు, ఆధునిక సాంకేతికతల వినియోగం ద్వారా రైతులు అధిక లాభాలు పొందే అవకాశాలపై అవగాహన కల్పించారు. రైతులు అడిగిన సందేహాలకు సమాధానాలు అందిస్తూ ఆరుతడి విధానాన్ని తమ పొలాల్లో అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తొడేటి రమేష్, కూచనపల్లి మాజీ సర్పంచ్ మడప జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి

కౌన్సిలర్‌తో కలిసి మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

హుస్నాబాద్ రూరల్, జూన్6, ప్రభాతవార్త: పట్టణంలో శనివారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 2, 11, 13, 15, 18 వార్డులలో సంబంధిత కౌన్సిలర్ల అధ్యక్షతన వార్డుసభలు నిర్వహించారు. సభలకు మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వార్డు సభల అనంతరం రోడ్ల శుభ్రత, డ్రైనేజీల పరిశుభ్రత, మొక్కల నాటడం, దోమల నివారణ స్ప్రేయింగ్, బ్లీచింగ్ చల్లించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ పట్టణ అభివృద్ధి, పరిశుభ్రత లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు సామూహిక పరిశుభ్రతకు బాధ్యత వహించాలని సూచించారు. ఇంటి చెత్తను నాలుగు రకాలుగా వేరుచేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు. వార్డులలో సమస్యలను ప్రజలు నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి పురపాలక సంఘం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు బూరుగు లత, పి. వరప్రసాద్, బొల్లి శ్రీనివాస్, ఆకుల రజిత, వాల సుప్రజనీన్‌రావు, మున్సిపల్ అధికారులతో పాటు తదితరులు ఉన్నారు.

పేదలకు చీరెల పంపిణీ

గజ్వేల్ టౌన్, జూన్ 6 (ప్రభాతవార్త): పట్టణంలోని అంగడిపేట హనుమాన్ దేవాలయంవద్ద శనివారం పట్టణ కిరాణా వర్తక సంఘం ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిరాణా వర్తక సంఘం అధ్యక్షులు సిద్ది బిక్షపతి మాట్లాడుతూ పేదవారికి సేవ చేయడంలో ఉన్న తృప్తి మరొకటి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దూబకుంట మైత్రాములు, మర్యాల లింగం, దూబకుంట లక్ష్మణ్, కైలాస శ్రీనివాస్, వీరేశం, మురళి తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేట మండలంలో గ్రామసభ

అక్కన్నపేట, జూన్ 6, ప్రభాతవార్త : మండల కేంద్రంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభకు సర్పంచ్ జన్నారపు సంపత్ అధ్యక్షత వహించగా, స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో జయరాంనాయక్, జడ్పీ సీఈవో రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పలు ముఖ్య అంశా లపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా వర్షాకాల సన్నద్ధత, సురక్షిత త్రాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ – మన సంరక్షణ, మొక్కల పెంపకం – వన మహోత్సవం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్), వరద నీటి నిర్వహణ మరియు భద్రత వంటి అంశాలపై అధికారులు సమగ్రంగా వివరించారు. గ్రామస్తులు తమ సమస్యలు, అవసరాలను గ్రామసభలో అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ప్రజలు ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములు కావడంతోపాటు గ్రామాభివృద్ధికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మహేష్, ఉపసర్పంచ్ శ్రీలేఖ మహేందర్, వార్డు సభ్యులు, వ్యవసాయ విస్తరణ అధికారి సబియా, జీపీఓ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేటలో గ్రామ సభ దృశ్యం

మున్సిపాలిటీలో వార్డు సభలు

మేడ్చల్, జూన్ 6, ప్రభాతవార్త:

ప్రజాపాలన ప్రగతిప్రణాళికలోభాగంగా ఎల్లంపేటమున్సిపాలిటీలోని డబిల్ పూర్, శ్రీరంగవరం గ్రామాల్లో శనివారం వార్డుసభలను నిర్వహించారు. ఈ సభల్లో ప్రజాసమస్యలపైచర్చించి ప్రజల ఇబ్బందులను అధికారులు తెలుసుకున్నారు. కాగా, వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందిలేకుండా డ్రైనేజీలను ఏర్పాటుచేయాలని, గుంతలరోడ్లను సరిచేయాలని ప్రజలు కోరారు. అదేవిధంగా తాగునీటి సరఫరా సక్రమంగా జరగడంలేదని, వీధిలైట్లు వెలగడంలేదని ప్రజలు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను వెంటనే పరిష్కరించి, ఇబ్బందిలేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి ఈసందర్భంగా మాట్లాడుతూ వార్డులవారీగా ప్రజాసమస్యలను గుర్తించి వాటిపరిష్కారంకోసం ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తామని, అభివృద్ధిలో ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, వైస్‌చైర్‌పర్సన్ రజిత, వార్డుకౌన్సిలర్లు, మహిళాసంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నూతన తహసీల్దార్‌ను సన్మానించిన మండల బిఆర్ఎస్ నాయకులు

నూతన తహసీల్దార్‌ను సన్మానించిన వంగ వెంకట్‌రెడ్డి

శామీర్‌పేట, జూన్ 6, ప్రభాతవార్త:

శామీర్‌పేట మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సిహెచ్ శ్రీనివాస్‌ను మండల బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వంగ వెంకట్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి అభినందనలు తెలియజేశారు. శనివారం శామీర్‌పేట మండల తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవలనే బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ సిహెచ్ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ మైన్స్ డిపార్ట్‌మెంట్‌లో జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహించి శామీర్‌పేట మండలానికి తహసీల్దార్‌గా సిహెచ్ శ్రీనివాస్ బదిలీపై వచ్చి బాధ్యతలు తీసుకోవటంతో తహసీల్దార్‌ను ఛాంబర్‌లో బిఆర్ఎస్ మండల సీనియర్‌నాయకులు వంగ వెంకట్‌రెడ్డి కలిసి సన్మానించారు.

సిఎం బహిరంగసభను విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న దోసకాయల వెంకటేశ, పాల్గొన్న కౌన్సిలర్, పలువురు కాంగ్రెస్ నాయకుల దృశ్యం

శామీర్‌పేట, జూన్ 6, ప్రభాతవార్త:

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని ఉప్పల్ బగాయత్‌లో ఆదివారం సాయంత్రం జరిగే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి బహిరంగసభను విజయవంతం చేయాలని మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ కోరారు. శనివారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీలో జరిగిన సమావేశంలో ఆయనతోపాటు కౌన్సిలర్, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా దోసకయాల వెంకటేశ మాట్లాడుతూ మల్కాజ్‌గిరి మున్సిపల్‌కార్పొరేషన్ కార్యాలయ నూతనభవన నిర్మాణానికి శంకుస్థాపన చేయటానికి సిఎం రేవంత్‌రెడ్డి ఆదివారం సాయంత్రం విచ్చేస్తున్నట్లు తెలిపారు. శంకుస్థాపన తరువాత సాయంత్రం 5 గంటలకు బహిరంగ సభ జరుగుతుందని, దీనిలో రాష్ట్ర, జిల్లా, మండలాల, మున్సిపాల్టీల కాంగ్రెస్‌పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీనాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మూడుచింతలపల్లి మున్సిపాల్టీ కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి బండి జగన్నాథం, కౌన్సిలర్ పాపిరెడ్డి, కాంగ్రెస్‌నాయకులు జి.భస్వారెడ్డి, వీరేశంగుప్తా, రాజేంద్రప్రసాద్‌గౌడ్, జెర్రిపోతుల నర్సింలు, వేణుగోపాల్‌రావు, గురువయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

తలకొండపల్లి, జూన్ 6, ప్రభాతవార్త:

రాష్ట్రప్రభుత్వం అందజేస్తున్న ప్రభుత్వ సంక్షేమపథకాలు అర్హులైన గ్రామస్థులు అందరు సద్వినియోగపరచుకోవాలని చీపునుంతల సర్పంచి గుజ్జుల లక్ష్మమ్మఆశన్న తెలిపారు. శనివారం మండలపరిధిలోని చీపునుంతల గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ ఆశన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడివో సీతారామమ్మ, పంచాయతీ కార్యదర్శులు, ఉపసర్పంచ్ మాజీ మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు గుజ్జుల మహేష్, యువకులు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

ప్రజాసేవలో వైఎస్ఆర్ నిబద్ధత పార్టీ పటిష్టత

సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఘట్‌కేసర్, జూన్ 6, ప్రభాతవార్త:

ప్రజాసేవలో నిబద్ధతతో పనిచేస్తూ బిజెపి బలోపేతానికి కృషి చేస్తున్న సుదర్శన్‌రెడ్డి ఉన్నతశిఖరాలను అధిరోహించాలని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బీబీనగర్ ఎయిమ్స్ పర్యటనలో భాగంగా శనివారం ఆయన అవుషాపూర్‌మీదుగా వెళ్తుండగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు-ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మర్యాదపూర్వకంగా వెళ్లి కలిశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కొద్దిసేపు ఆగి మాట్లాడి సుదర్శన్‌రెడ్డికి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. నిరంతరం ప్రజాసేవలో ఉంటూ చేపడుతున్న సేవా కార్యక్రమాలతో సమూజంలో వైఎస్ఆర్‌కు గుర్తింపు వచ్చిందని భవిష్యత్‌లో మరిన్ని పదవులు పొందాలని కిషన్‌రెడ్డి ఆకాక్షించారు.

మున్సిపల్ నూతన కమిషనర్‌కు సన్మానం

శామీర్‌పేట, జూన్ 6, ప్రభాతవార్త:

మూడుచింతలపల్లి మున్సిపల్ నూతన కమిషనర్ వెంకటగోపాల్‌ను మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. శనివారం మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయంలో నూతన కమిషనర్ వెంకటగోపాల్‌ను ఆయనతోపాటు కౌన్సిలర్ పాపిరెడ్డి, మరికొందరు నాయకులు బి.జగన్నాథం, జి.భస్వారెడ్డి, మందస్వామి, రవీందర్, తదితరులు పాల్గొని ఆయనను అభినందించారు. మూడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించటంతో వారు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా కొనసాగిన పవన్‌కుమార్ బదిలీపై వెళ్లారు.

అనుమతిలేని అనాథ శరణాలయాలపై కఠినచర్యలు

-మేడ్చల్ జిల్లా సంక్షేమ అధికారిణి శారద

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 6, ప్రభాతవార్త:

జిల్లాలో అనుమతిలేని అనాథశరణాలయాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుందని, ప్రతి అనాథశరణాలయం స్వచ్ఛంధసంస్థ తప్పనిసరిగా జిల్లా మహిళా, శిశుసంక్షేమశాఖ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలని జిల్లా సంక్షేమశాఖ అధికారిణి పేర్కొన్నారు. అనుమతిలేనివాటిపై ఒక సంవత్సరం జైలుశిక్ష, లక్షరూపాయల జరిమాన విధించటం జరుగుతుందని జిల్లా అధికారిణి శారద అన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలి

-ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

కొడంగల్, జూన్ 6, ప్రభాతవార్త:

కొడంగల్ మండలంలోని రుద్రారం గ్రామంలో ఏప్రిల్ 29న జీవన్గి గ్రామానికి చెందిన తలారి హరికృష్ణ అనుమానస్పద మృతిపై పోలీసులు పూర్తిస్థాయి విచారణచేపట్టి బాధితకుటుంబానికి న్యాయంచేయాలని వివిధ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్‌చేశారు. శనివారం కొడంగల్ మార్కెట్ యార్డులో బాధిత కుటుంబసభ్యులు వివిధ ప్రజాసంఘాల నాయకులతో కలిసి విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. ఘటన జరిగి 40 రోజులు గడుస్తున్నా, ఇప్పటివరకు పోస్టుమార్టం నివేదిక రాకపోవడంలో ఆంతార్యం ఏంటని ప్రశ్నించారు. హరికృష్ణ మృతిపై అనుమానం ఉందని, హత్యచేసి ఉంటారని వారు అనుమానం వ్యక్తంచేశారు. పోలీసులు కేసును పక్కదారి పట్టించేలా వ్యవహరించడం సరైందికాదని ఆరోపించారు. ఇప్పటికైనా కేసును పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి న్యాయంచేయాలన్నారు. లేనిపక్షంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ముదిరాజ్‌సంఘం నాయకులు వెంకటయ్య, కూర వెంకటయ్య, వివిధ ప్రజా సంఘాల నాయకులు గోపి, చంద్రయ్య, సాయిలు, అన్నారం సాయిలు, వెంకటయ్య, లక్ష్మి, అశోక్, మృతుని కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

భరోసా కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

అవగాహన కల్పిస్తున్న భరోసా కేంద్రం బృందం సభ్యులు

మేడ్చల్, జూన్ 6, ప్రభాతవార్త:

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతిప్రణాళిక చివరిరోజు ముగింపు కార్యక్రమాల్లో భాగంగా మేడ్చల్ భరోసాకేంద్రం ఆధ్వర్యంలో అత్వెల్లిలో ప్రజలకు చట్టాలపై అవగాహనసదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మహిళలు, పిల్లల రక్షణ చట్టాలు. పోక్సో చట్టం, అత్యాచారనిరోధక చట్టాలు, ఈవ్‌టీజింగ్ (వేధింపులు), బాల్యవివాహాలనిషేధం, బాలల లైంగికవేధింపుల నివారణ, లింగ సమానత్వంతో పాటు సామాజిక అవగాహన లింగ వివక్ష, పితృస్వామ్య వ్యవస్థ, లింగ సమానత్వం, సెక్సిజం (లైంగిక పక్షపాతం), పిల్లలకు మంచిస్పర్శ, కీడుస్పర్శపై అవగాహన కల్పించారు. మానవ అక్రమ రవాణా, దోపిడీ, లేబర్ ట్రాఫికింగ్, లైంగిక దోపిడీ, అవయవాల అక్రమ రవాణా సైబర్ నేరాలు, సైబర్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, అత్యవసర సహాయకేంద్రాల సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భరోసాకేంద్రం కోఆర్డినేటర్ కళ్యాణి, లీగల్ కౌన్సిలర్ రోజా, సిబ్బంది అఖిల, బి.మౌనిక, సమీనా, డి.మౌనిక తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి మున్సిపాలిటీ చర్యలు

-ఇంద్రానగర్ కాలనీలో బోర్‌మోటార్ ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

షాద్‌నగర్, జూన్ 6, ప్రభాతవార్త:

పట్టణంలోని 26వ వార్డు ఇంద్రానగర్ కాలనీలో స్థానిక ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని కొత్తగా ఏర్పాటు చేసిన బోర్‌మోటార్‌ను మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ప్రారంభించారు. సాయిరాజా టాకీస్ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ బోర్‌మోటార్‌ను శనివారం ఆయన చేతులమీదుగా ప్రారంభించి ప్రజలకు అంకితంచేశారు. ఈ సందర్భంగా చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ, వేసవికాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపా లిటీ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నీటి సరఫరా సమస్యలను గుర్తించి, వాటిపరిష్కారానికి అవసరమైన మౌలికవసతులను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ఇంద్రానగర్ కాలనీలో ఏర్పాటుచేసిన ఈ కొత్త బోర్‌మోటార్ ద్వారా స్థానికులకు తాగునీటి సరఫరా మరింత మెరుగుపడనుందని అధికారులు తెలిపారు. ప్రజలకు నిరంతరాయంగా పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు మున్సిపాలిటీ కట్టుబడి పనిచేస్తోందని పేర్కొ న్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ ఎస్పీ శివ, నాగమణి, బొట్టు రాజు, దాసు, ప్రకాష్, జాను, నగేష్, రామచంద్రయ్య, జ్యోతి, మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి పండుగ..

-పాల్గొన్న ఎంపి రాజేందర్

అవుషాపూర్‌లో బొడ్రాయి పూజలో పాల్గొన్న ఎంపి రాజేందర్

ఘట్‌కేసర్, జూన్ 6, ప్రభాతవార్త:

ఘట్‌కేసర్‌సర్కిల్ ఎదులాబాద్‌డివిజన్ అవుషాపూర్‌లో బొడ్రాయి పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారు. బొడ్రాయి ప్రతిష్ఠించి రెండేళ్లుకావడంతో ద్వితీయ వార్షికోత్సవ ఉత్సవాలు జరుపుతున్నారు. బొడ్రాయి ఉత్సవ కమిటీ చైర్మన్ కొట్టి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీప్రజాప్రతినిధులు, నాయకులు అవసరమైన ఏర్పాట్లుచేశారు. శనివారం ఉదయం బొడ్రాయికి పంచామృత అభిషేకం, పవిత్రనీటితో అభిషేకం, బోనాలుచేసి బొడ్రాయికి సమర్పించారు. మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, మాజీఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డితో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు విచ్చేసి బొడ్రాయిని సందర్శించి పూజలు చేశారు. అవుషాపూర్‌లో నాయకులు పెద్దసంఖ్యలో బొడ్రాయి పండుగ ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. గ్రామదేవతల ఆలయాలను వివిధరకాల పూలు, వేపాకులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం ప్రజలు గ్రామదేవతలకు బోనాలను సమర్పించేందుకు తగిన ఏర్పాట్లు చేసుకున్నారు. శనివారం రాత్రి గౌడ కులస్థులు కంఠమహేశ్వరస్వామికి డప్పు శబ్దాల మధ్య బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి సమర్పించారు.

చలో కోహెడ..

మోమిన్‌పేట, జూన్ 6, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాలమేరకు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతులమీదుగా శనివారం రంగారెడ్డిజిల్లా పరిధిలో నూతనంగా నిర్మిస్తున్నటువంటి అంతర్జాతీయ సమీకృత (ఫ్రూట్) పండ్ల మార్కెట్ పారంభోత్సవ కార్యక్రమానికి మోమిన్‌పేట్ మండలం నుండి వికారాబాద్ ఆర్టీసి బస్సులలో భారీసంఖ్యలో రైతులు, ప్రజలు బయలుదేరారు. మండలపరిధిలోని వెల్‌చాల్ వ్యవసాయశాఖ క్లస్టర్ ఏఈఓ స్వాతి, అగ్రికల్చర్ అధికారి రాజేందర్ ఆధ్వర్యంలో దుర్గంచెర్వు, రాంనాథ్‌గుండుపల్లి, మొరంగపల్లి, వెల్‌చాల్ గ్రామాల రైతులు, మహిళలు సామూహికంగా జెండా ఊపి బహిరంగ సభకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ రమేశ్, సిసి చెంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, జీపీఓ వెంకటపతి, మహిళా సంఘాల వీఓఏలు లక్ష్మి, షహనాజ్ సుల్తానా, అరుణ, నాయకులు రఘురాంరెడ్డి, వీరన్న, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

-మున్సిపల్ చైర్ పర్సన్ శ్వేతా పాండురంగారెడ్డి

శంకర్‌పల్లి, జూన్ 6, ప్రభాతవార్త:

శంకర్‌పల్లి మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని మున్సిపల్ చైర్ పర్సన్ శ్వేత పాండురంగారెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలోని 8వవార్డులో అధికారులు కౌన్సిలర్లతో కలిసి పర్యటించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అఖిల యాదిరెడ్డి, నాయకులు యాదయ్యగౌడ్, మునిసిపల్ మేనేజర్ పాల్గొన్నారు.

పోలీసుశాఖ చేపడుతున్న కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

-ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జూన్ 6, ప్రభాతవార్త:

పోలీసుశాఖ చేపడుతున్న కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పరిగిలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రాతో కలిసి సురక్షమిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోనే మొట్టమొదటిసారిగా పరిగి పట్టణంలో సురక్షమిత్ర కార్యక్రమాన్ని ప్రారంచడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం ప్రజలసంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలను అమలుచేస్తోందని అన్నారు. అయితే ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే వాటి లక్ష్యాలు పూర్తిస్థాయిలో నెరవేతాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ రజితవెంకటేష్, డిపిఒ జయసుధ, మున్సిపల్‌వైస్‌చైర్మన్ కమల్‌నాయక్, ఎఎంసి చైర్మన్ పరుశురాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.మల్లేష్, ఎస్‌డిపిఒ శ్రీనివాస్, ఎంపిడిఓ హరిప్రియరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వరి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కుల్కచర్ల, జూన్ 6, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థులు శుక్రవారం ఆత్మీయసమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 1998-99 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు 20 ఏళ్ల తరువాత అదే పాఠశాలలో ఒకరినొకరు కలుసుకుని ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గుర్తుంచుకుని ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతివిద్యార్థి ఉన్నతస్థాయికి ఎదిగినప్పుడే తల్లిదండ్రులతోపాటు విద్యనేర్పిన గురువులకు గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

సర్కారు బడిలోనే ప్రీప్రైమరీ తరగతులు

-హెచ్ఎం డాక్టర్ వరకాల పరమేష్

విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న వరకాల పరమేష్

ఇబ్రహీంపట్నం, జూన్ 6, ప్రభాతవార్త:

బడి వయసు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యంగా ఆదిబట్ల ప్రాథమికపాఠశాలలో శనివారం బడిబాట కార్యక్రమాన్ని ఉత్సాహంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ వరకాల పరమేష్ మాట్లాడుతూ.. ప్రతిచిన్నారికి నాణ్యమైనవిద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రతి ఏటా ఈబడిబాట ప్రచారాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఈవిద్యాసంవత్సరం తమ పాఠశాలలో ప్రీప్రైమరీ నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి తరగతులు ప్రారంభిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. సర్కారు బడుల్లో ఉచిత విద్యతో పాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ విద్య వంటి వసతులు ఉన్నాయన్నారు. బడిబాట ప్రచారంలో కార్యక్రమంలో భాగంగా శనివారం ఉపాధ్యాయులు, కమిటీసభ్యులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీవెళ్లి తల్లిదండ్రులను చైతన్యపరిచినట్లు చెప్పారు. మన ఊరు-మన బడి - ప్రతి చిన్నారి బడికి అనే లక్ష్యంతో అందరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, భాషయ్య, రజిత, తల్లిదండ్రులున్నారు.

గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలి: సర్పంచ్

మోమిన్‌పేట్, జూన్ 6, ప్రభాతవార్త:

గ్రామం అభివృద్ధి చెందాలంటే గ్రామంలోని ప్రతి ఒక్కరు సహకరించాలని వెల్‌చాల్ గ్రామ సర్పంచ్ కావలి శ్రీనివాస్ పేర్కొన్నారు. "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" 99, రోజుల కార్యాచరణ ప్రణాళికలో బాగంగా శనివారం మోమిన్‌పేట్ మండలంలోని పలు గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సంధర్భంగా వెల్‌చాల్ గ్రామ పంచాయతి కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతు వర్షాకాల సన్నద్ధతపై ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించాలని, వర్షపునీరు నిలువ కాకుండా చూసుకొని శుద్దమైన సురక్షిత నీరు త్రాగి ఆరోగ్యంగా ఉండాలని, ప్రజలు ఏదైనా అనారోగ్యానికి గురైనచో స్థానిక ఆరోగ్య ఉప కేంద్రంను సంప్రదించాలని సూచించారు. మరియు గ్రామంలోని ప్రజలు ప్రతి ఒక్కరు ఎవరికి వారు స్వచ్ఛందంగా పరిశుభ్రత పాటించాలని కోరారు. అనంతరం పంచామతి కార్యధర్శి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతు ఘనవ్యర్థాల నిర్వహణ, జలసంవరక్షణ మన సంవరక్షణ, మొక్కల పెంపకం, వనసంవరక్షణ, ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) తదితర అంశాలపై గ్రామసభలో వివరించారు. మరియు గ్రామ ప్రత్యేకాధికారి నర్సింలు మాట్లాడుతు తెలంగాణ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికొరకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని కనుకా సర్పంచ్‌తో పాటు గ్రామస్తులందరు కలిసి ఒకరికొకరు సహకరించుకుంటే మండల, జిల్లా స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలో వెల్‌చాల్ గ్రామం ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎన్నిక కావడం జరుగుతుందని తెలిపారు. మోమిన్‌పేట్ మండలంలో వెల్‌చాల్ గ్రామం చాలా కాలంనుండి కూడా అభివృద్ధిలో ముందుంటుందని అన్నారు. ప్రస్తుతం యువనాయకుడు సర్పంచ్ శ్రీనివాస్ హయాంలో ఉత్తమ గ్రామ పంచాయతి కావడం ఖాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉపసర్పంచ్ రాజుల రమేశ్, వార్డు సభ్యులు,ఏఎంసి డైరెక్టర్ విజెందర్‌రెడ్డి, నాయకులు రఘురాంరెడ్డి, యువకులు, ప్రజాత్రినిధులు, గ్రామ పరిపాలనాధికారి వెంకటపతి, విధ్యుత్ లైన్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసాచారి, సిసి చెంద్రయ్య, పంచాయతి సిబ్బంది, ఆశావర్కర్ యాదమ్మ గ్రామస్తులు తదితరులు పాల్గొనారు.

రిజర్వాయర్ భూసేకరణకు తక్షణ చర్యలు తీసుకోండి

-మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వినతి

షాద్‌నగర్, జూన్ 6, ప్రభాతవార్త:

షాద్‌నగర్: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం(పిఆర్ఎల్ఐఎస్)లో భాగమైన కొందుర్గు-పరిగి లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలమూరు ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేకంగా కలుసుకొని స్వయంగా వినతిపత్రాన్ని అందజేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో పరిగి, షాద్‌నగర్ నియోజకవర్గాలు చివరి భాగంలో ఉన్నాయని, ఉదండాపూర్ నుంచి కొందుర్గు-పరిగి-లక్ష్మీదేవిపల్లి వరకు మిగిలిన పనులు పూర్తైతే సాగు, తాగునీటి అవసరాలు తీర్చడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రిజర్వాయర్ నిర్మాణం, పంప్ హౌస్ ఏర్పాటు, ఉదండాపూర్ రిజర్వాయర్ నుంచి లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ వరకు కాలువలు, టన్నెల్ నిర్మాణాలకు సంబంధించి మొత్తం 2,919 ఎకరాల భూమి అవసరమవుతుందని తెలిపారు. ఈ భూసేకరణకు సుమారు రూ.350.84 కోట్ల పరిహారం అవసరమవుతుందని వినతిపత్రంలో వివరించారు.

సిఎం పర్యటన విజయవంతం: శంకర్

పాలమూరు ఉమ్మడి జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన విజయవంతం అయ్యిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను మీడియా పలకరించగా ముఖ్యమంత్రి పర్యటన విశేషాలను వివరించారు. సోమశిలలో కలెక్టర్లు, సిఈలతో జరిగిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలమూరు రంగారెడ్డి జిల్లా ప్రాజెక్టుపై సుదీర్ఘమైనచర్చ చేశారని తెలిపారు.

సిఎం సభకు కోహెడ బయలుదేరిన రైతులు

తలకొండపల్లి, జూన్ 6, ప్రభాతవార్త:

తలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాల నుంచి రైతులు మహిళలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే కోహెడలో జరిగే సమావేశానికి బయలుదేరారు. శనివారం రంగారెడ్డి జిల్లా పరిధిలోని హయత్‌నగర్ మండలపరిధిలో కోహెడగ్రామం సమీపంలో నిర్వహించే అంతర్జాతీయ పండ్లమార్కెట్ ప్రారంభోత్సవానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్నందున ఆయా గ్రామాల నుంచి ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆర్టీసీ బస్సుల్లో రైతులు మహిళలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సింగల్ విండో చైర్మన్ గట్లకేశవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దోకూరు ప్రభాకర్ రెడ్డి, సర్పంచుల సంఘం నాయకుల కాసు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుజ్జుల మహేష్‌తో పాటు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పార్టీ కార్యకర్తలు తరలివెళ్లారు.

అభివృద్ధిని ప్రజలముందు ఉంచేందుకే గ్రామసభ

-ఎంపిటిసి సుందర్

పూడూరు, జూన్ 6, ప్రభాతవార్త:

ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించి నిర్వహించిన అభివృద్ధిని ప్రజల ముందు ఉంచేందుకే గ్రామసభను ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపిఒ సుందర్ వివరించారు. 99రోజుల ప్రజాపాలన-ప్రగతిప్రణాళికలో భాగంగా శనివారం పూడూరు మండలపరిధిలోని రాకంచెర్లగ్రామ పంచాయతీ ఆవరణలో ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారంకోసమే రాష్ట్రప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టిందని పేర్కొన్నారు. ఇప్పటివరకు గ్రామంలో నిర్వహించిన అభివృద్ధి పనుల వివరాలను తెలియజేశారు. గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్నా, గ్రామసభ తీర్మానం ద్వారా ఒక్కొక్కటి నెరవేర్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీసర్పంచ్ పెంటయ్య, ఉపసర్పంచ్ సాయన్న, వార్డుసభ్యులు ఖరీం, పంచాయతీ కార్యదర్శి గోవిందు, పలుశాఖల అధికారులు, మహిళా, యువజన సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

నీటి పొదుపు.. ప్రగతికి మలుపు..

-తాగునీటి బోరు మోటర్ ప్రారంభించిన సర్పంచ్ కొమ్ము కృష్ణ

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో బోరు మోటర్ ప్రారంభించిన సర్పంచ్

నందిగామ, జూన్ 6, ప్రభాతవార్త:

జలమే జీవమని.. ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా వాడాలని నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ స్పష్టంచేశారు. శనివారం నందిగామ మండలం డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మంచినీటి బోరు మోటర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక ప్రణాళిక సిద్ధంచేశారన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటేష్‌గౌడ్, వార్డుసభ్యులు అగ్గిప్రసాద్, బొమ్మగల్ల నర్సింలు, నాయకులు బి.కృష్ణ యాదవ్, బొమ్మగళ్ళ లింగం, సాయిబాబు, మంగలి శ్రీను, కారోబార్ శ్రీను తదితరులు ఉన్నారు.

గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

-సర్పంచ్ రవీందర్‌నాయక్

గ్రామ సభల్లో పాల్గొన్న సర్పంచ్ రవీందర్‌నాయక్

కుల్కచర్ల, జూన్ 6, ప్రభాతవార్త:

గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సకరించాలని సర్పంచ్ రవీందర్ నాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఘనపూర్ గ్రామంలో 99 రోజుల ప్రణికలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో గ్రామానికి సంబంధించిన పలు సమస్యలు, అభివృద్ధి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవీందర్ నాయక్ మాట్లాడుతూ..గ్రామ అభివృద్దే లక్ష్యంగా ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. గ్రామ సభలో ప్రస్తావించిన ప్రతి అంశాన్ని పరిశీలించి, దశలవారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గ్రామ సినియర్ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జెఈఈ మెయిన్స్‌లో గిరిజన విద్యార్థికి ఎనిమిదో ర్యాంకు

తలకొండపల్లి, జూన్ 6, ప్రభాతవార్త:

ఆల్ ఇండియా స్థాయిలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ ఫలితాలు వెలువడడంతో ఆల్ ఇండియా స్థాయిలో 8ఎనిమిదో ర్యాంకు సాధించిన గిరిజనవిద్యార్థి కేతావత్ చరణ్‌నాయక్‌ను పలువురు తండావాసులు ప్రజాప్రతినిధులు అభినందించారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని ఆర్యనాయక్ తండాకు చెందిన నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన కేతావత్ చరణ్‌నాయక్ ఇటీవల ప్రకటించిన జెఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా స్థాయిలో ఎనిమిదో ర్యాంక్ సాధించి తండావాసులకు గిరిజనులకు మండలప్రజలకు పేరు తీసుకురావడం పట్ల సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కటికల శేఖర్‌యాదవ్, ఆర్యనాయక్, తండ సర్పంచ్ కొర్ర శిరీషకృష్ణనాయక్‌లు చరణ్‌నాయక్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. గిరిజనులకు, మండల ప్రజలకు మంచి పేరు తీసుకురావాలని ఈసందర్భంగా వారు కొనియాడారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్, జూన్ 6, ప్రభాతవార్త:

మద్యానికి బానిసై అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెంది ఓవ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శుక్రవారంరాత్రి 11గంటలకు ఘట్‌కేసర్ ప్లాట్ ఫామ్ నెం.1 కిలోమీటర్ నెం.213/31-32 డౌన్‌లైన్‌లో పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి శవం పడి ఉందని సికింద్రాబాద్ జీఆర్‌పి పోలీసులకు సమాచారం రావడంతో వారు ఘటనాస్థలానికి చేరుకొని విచారణ జరిపారు. మృతునివద్ద లభించిన ఆధార్ ఆధారంగా వివరాలు సేకరించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లాపూర్ చింతల్ ద్వారకానగర్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి జె.కృష్ణప్రసాద్(50)గా గుర్తించారు. మృతుడు మద్యానికి అలవాటు పడి అప్పులు చేసి తీర్చలేక సతమతమవుతూ భార్యతో గొడవ పడుతుండేవాడు. దీంతో భార్య 8 నెలల క్రితం వెళ్లిపోయి కూకట్‌పల్లిలోని తన బంధువుల దగ్గర ఉంటుంది. ఆర్థికసమస్యలు, భార్య దూరంగా ఉండటంతో తీవ్ర మనస్తాపం చెందిన కృష్ణప్రసాద్ జీవితంపై విరక్తి చెంది ఘట్‌కేసర్‌కు వచ్చి రైలుకింద పడి ఆత్మహత్యచేసుకున్నాడు. ఈమేరకు శవాన్ని పోస్టుమార్టమ్ అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని జీఆర్‌పి పోలీసులు తెలిపారు.

నాగారంలో ఉపాధి కూలీ మృతి

కొడంగల్, జూన్ 6, ప్రభాతవార్త:

మండలంలోని నాగారం గ్రామంలో శనివారం ఉపాధికూలీ మృతిచెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికిచెందిన నర్సమ్మ (52) రోజుమాదిరిగానే శనివారం గ్రామంలో కూలీలతో ఆటు ఉపాధిహామీ పనులకు వెళ్ళింది. అక్కడ పనిచేస్తుండగా అలసట రావడంతో చెట్టుకింద కూర్చోంది. కొంతసేపటికి నీరసంగా ఉందని చెప్పడంతో గ్రామంలోని ఆర్ఎంపి వైద్యుడి వద్దకు తీసుకొని వెళ్ళారు. పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో 108వాహనంలో కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలికి కుమారుడు ప్రవీణ్‌కుమార్, భర్త మల్లప్ప ఉన్నారు.